ఆంధ్రజ్యోతి
andhrajyothy.com
ఆదివారం ఉష్ణోగ్రత గరిష్ఠం 36.9 । కనిష్ఠం 22.7
నిర్మల్ జిల్లా వార్తలు
8
సోమవారం 24 మార్చి 2025







కొత్త కాలువ ఏర్పాటుకు.. బ్రేక్!

- జిల్లాలో సదర్మాట్ కొత్త కాలువ నిర్మాణానికి అటవీ శాఖ ఆటంకాలు
- ప్రత్యామ్నాయంగా గోదావరి నదిలో అడ్డుగోడలు
- మూడు చోట్ల కుర్రుల మధ్య నిర్మించేందుకు అంచనాలు
- జగిత్యాల జిల్లా వైపు నీరు వెళ్లకుండా అడ్డు చర్యలు
- మూడు కోట్ల రూపాయలు వ్యయమయ్యే అవకాశం

నిర్మల్, మార్చి 23(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని మామడ మండలం పొన్కల్ వద్ద నిర్మిస్తున్న సదర్మాట్ బ్యారేజీ నుంచి ఖానాపూర్‌లోని పాత సదర్మాట్ బ్యారేజీ వరకు ప్రత్యేక కాలువ నిర్మించాలన్న రైతుల డిమాండ్‌కు అటవీ శాఖ అనుమతులు బ్రేక్ వేస్తున్నాయి. దాదాపు ఏడు కిలో మీటర్ల పొడవుతో ఈ కాలువను నిర్మించాలని ఇక్కడ రైతాంగం గత కొద్ది రోజుల నుంచి డిమాండ్ చేస్తున్న సంగతి తెలిసిందే. ఈ కాలువ కోసం ఇప్పటికే రాజకీయాలకు అతీతంగా రైతులు ఆందోళనలు చేశారు. అయితే ఇరిగేషన్ అధికారులు మాత్రం ఈ కాలువను నిర్మించడం సాధ్యం కాదని స్పష్టం చేస్తున్నారు. కొత్త సదర్మాట్ నుంచి పాత సదర్మాట్ వరకు ఉన్న మార్గమంతా అటవీ శాఖ పరిధిలో ఉండడంతో ఆ శాఖ నుంచి అనుమతులు రావడం సాధ్యం కాదని ఇరిగేషన్ అధికారులు స్పష్టం చేస్తున్నారు. ప్రస్తుతం నిర్మిస్తున్న బ్యారేజీ అంచనాలలో ఈ కాలువ నిర్మాణ ప్రతిపాదనలు లేవని.. అయితే ప్రత్యామ్నాయం కోసం ప్రయత్నాలు చేస్తున్నామని అధికారులు చెబుతున్నారు. పొన్కల్ బ్యారేజీ నుంచి పాత సదర్మాట్ బ్యారేజీ వరకు గోదావరి నదిలో కుర్రులు ఉన్నచోట అడ్డుగోడలు నిర్మించనున్నట్లు అధికారులు వెల్లడిస్తున్నారు. ఈ అడ్డుగోడల ద్వారా కొత్త సదర్మాట్ నీరు పాత సదర్మాట్‌కు నేరుగా చేరుకుంటుందని వివరిస్తున్నారు. ఈ అడ్డుగోడల కారణంగా జగిత్యాల జిల్లా వైపు నీరు ప్రవహించకుండా నేరుగా పాత సదర్మాట్‌లోకి చేరుకుంటుందని అధికారులు చెబుతున్నారు. అయితే రైతులు మాత్రం కాలువ నిర్మాణం జరిగితేనే పాత సదర్మాట్‌కు గోదావరి నీరు వస్తుందని లేనట్లయితే తమకు తిప్పలు తప్పవని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రైతులు డిమాండ్ చేస్తున్న కాలువ మార్గమంతా రిజర్వ్ ఫారెస్ట్‌లో ఉన్న కారణంగా అనుమతులు రావాలంటే ఏళ్ల సమయం పడుతుందని, ఓ దశలో అనుమతులు కూడా మంజూరు కాకపోవచ్చని అధికారులు వివరిస్తున్నారు. పొన్కల్ సదర్మాట్ బ్యారేజీ నిర్మాణం అంచనాలలో ఇప్పటికే ఇరిగేషన్ శాఖ మూడు చోట్ల గోదావరి నది కుర్రుల మధ్య అడ్డుగోడలు నిర్మించే ప్రతిపాదనలు పొందుపరిచినట్లు అధికారులు స్పష్టం చేస్తున్నారు. సుమారు 1.5 కిలోమీటర్ల పొడవుతో మూడు చోట్ల నిర్మించే ఈ అడ్డుగోడల కోసం దాదాపు మూడు కోట్ల రూపాయల మేరకు అంచనాలను పొన్కల్ బ్యారేజీ నిర్మాణ పనులలోనే పొందు పరచామని చెబుతున్నారు. కుర్రుల మధ్య నిర్మించే అడ్డుగోడల కారణంగా గోదావరి పొన్కల్ బ్యారేజీ నుంచి నేరుగా పాత సదర్మాట్ బ్యారేజీకి నీటి ప్రవాహం చేరుకుంటుందని అధికారులు వివరిస్తున్నారు. దీంతో పాత సదర్మాట్ బ్యారేజీలో రైతులకు మూడు కాలాల పాటు నీరు అందుబాటులో ఉంటుందని ఇరిగేషన్ అధికారులు వెల్లడిస్తున్నారు. ప్రస్తుతం పాత సదర్మాట్ బ్యారేజీ కింద దాదాపు 13 వేల ఎకరాల సాగు లక్ష్యం ఉంది. అయితే ప్రతియేటా గోదావరి నది ప్రవాహం వేసవిలో పూర్తిగా తగ్గిపోవడంతో పాత సదర్మాట్ ఆయకట్టు రైతాంగం సాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులకు గురవుతున్న సంగతి తెలిసిందే. దీని కారణం గానే రైతులు కొత్త సదర్మాట్ బ్యారేజీ నుంచి పాత సదర్మాట్ బ్యారేజీ వరకు కాలువ నిర్మించాలని కోరుతున్నారు. ఇరిగేషన్ అధికారులు మాత్రం కాలువ నిర్మాణం సాధ్యం కాదని, ప్రత్యామ్నాయంగా ఇప్పటికే గోదావరిలో అడ్డుగోడలను నిర్మించతలపెట్టామని చెబుతున్నారు.


ఖానాపూర్ సమీపంలో ఉన్న పాత సదర్మాట్ ఆనకట్ట(ఫైల్)

మూడు చోట్ల అడ్డుగోడలు

కాగా. కొత్తగా నిర్మిస్తున్న సదర్మాట్ బ్యారేజీ నుంచి ప్రస్తుతం ఉన్న పాత సదర్మాట్ బ్యారేజీ వరకు గల గోదావరి ప్రవాహంలో మూడుచోట్ల అడ్డుగోడలు నిర్మించాలని ఇరిగేషన్ అధికారులు భావిస్తున్నారు. అడ్డుగోడల కారణంగా గోదావరి వరద ప్రవాహం జగిత్యాల వైపు కాకుండా పాత సదర్మాట్ వైపు సాగుతుందని.. దీంతో దీని కింది ఆయకట్టుకు సాగు నీరందే అవకాశం ఏర్పడుతుందని వివరిస్తున్నారు. దాదాపు 1.5 కిలో మీటర్ల పొడవుతో మూడు చోట్ల ఈ అడ్డుగోడలను నిర్మించాలని నిర్ణయించారు. ఈ అడ్డుగోడల నిర్మాణం కారణంగా పాత సదర్మాట్‌లో మూడు కాలాల పాటు నీరు పుష్కలంగా అందుబాటులో ఉంటుందని అధికారులు వివరిస్తున్నారు. ఈ నీటితో పంటలను పెద్దఎత్తున సాగు చేసుకునే అవకాశం ఏర్పడుతుంది అంటున్నారు.

రూ.మూడు కోట్లతో అంచనాలు

గోదావరి నది మధ్యలో నిర్మించ తలపెట్టిన మూడు అడ్డుగోడల కోసం ఇరిగేషన్ అధికారులు మూడు కోట్ల రూపాయలతో అంచనాలను రూపొందించారు. ఈ అంచనాలను ఇప్పటికే ప్రభుత్వానికి నివేదించి నిధుల మంజూరు కోసం ఎదురుచూస్తున్నారు. ఒక్కో అడ్డుగోడ 1.5 కిలో మీటర్ల పొడవుతో నిర్మించాలని తలపెట్టారు. కొత్త సదర్మాట్ నుంచి పాత సదర్మాట్ వరకు కొత్త కాలువ నిర్మించేందు కోసం అటవీ శాఖ అనుమతులు తప్పనిసరి. అయితే ఈ ప్రాంతమంతా రిజర్వ్ ఫారెస్ట్‌లో ఉన్న కారణంగా ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతులు సాధ్యం కావని చెబుతున్నారు. అంతేకాకుండా దీని కారణంగా గోదావరి నది మధ్యలో అడ్డుగోడల నిర్మాణమే శరణ్యం అంటున్నారు.

ప్రతియేటా రబీలో నీటి తిప్పలు

పాత సదర్మాట్ బ్యారేజీ కింద పంటలు సాగు చేసే రైతులు ప్రతీయేటా రబీ సీజన్‌లో సాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. గతంలో ఎమ్మెల్యేలు సైతం ఎస్సారెస్పీ నుంచి సదర్మాట్ బ్యారేజీకి సాగునీరు అందించాలంటూ పెద్దఎత్తున ఆందోళనలు చేశారు. తమ పంట భూములన్నీ గోదావరి తలాపునే ఉన్నప్పటికీ ప్రతియేటా యాసంగి సీజన్‌లో సాగునీరు అందించుకోలేని పరిస్థితి ఉందంటూ సదర్మాట్ ఆయకట్టుదారులు వాపోతున్నారు. ఇప్పటికైనా ఈ విషయమై రాష్ట్ర ప్రభుత్వం యుద్ధప్రాతిపదికన పాత సదర్మాట్ బ్యారేజీ వరకు నీటిని అందించే ఏర్పాట్లు చేపట్టాలని కోరుతున్నారు.

మూల్యాంకనం పారదర్శకంగా నిర్వహించాలి

● డీఈవో రామారావు


మాట్లాడుతున్న డీఈవో రామారావు

నిర్మల్ కల్చరల్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి) : పదోతరగతి పరీక్షల మూల్యాంకన పారదర్శకంగా నిర్వహించాలని డీఈవో రామారావు ఆదేశించారు. ఆదివారం నిర్వహించిన సమావేశంలో మూల్యాంకన విధులను సీసీవోలు, ఏసీవోలకు వివరించారు. థామస్ స్కూల్‌లో వాల్యుయేషన్ క్యాంపు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కోడింగ్ ప్రక్రియ జాగ్రత్తగా చేయాలన్నారు. ఆర్జేడీ జూమ్ సమావేశంలో పలు సూచనలు చేశారు. ఏప్రిల్ 7 నుంచి మూల్యాంకన ప్రక్రియ ప్రారంభమవుతుందన్నారు. 60 మంది సీఈవోలు, 355 ఏఈలు, 120 స్పెషల్ అసిస్టెంట్లను విధుల్లోకి తీసుకుంటామన్నారు. సీనియారిటీ జాబితా రూపొందిస్తామని తెలిపారు. మూల్యాంకన విధులు పొరపాట్లకు తావు లేకుండా విజయవంతంగా పూర్తిచేయాలన్నారు. సమన్వయకర్త లింబాద్రి, కోడింగ్ అధికారులు లక్ష్మణ్ రావు, వెంకటేశ్వర్, రతన్ కుమార్, రమేష్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

భూ సమస్య పరిష్కారం కాలేదని

రైతు ఆత్మహత్యాయత్నం


ఆసుపత్రిలో చికిత్సపొందుతున్న రైతు తోడిశెట్టి భూమన్న

లక్ష్మణచాంద, మార్చి 23 (ఆంధ్రజ్యోతి) : భూ సమస్య పరిష్కారం కాలేదని రైతు ఆత్మహత్యాయత్నం చేసుకున్న సంఘటన మండలంలో సంచలనం రేపింది. అధికారులు పదిసంవత్సరాలుగా భూ పంచాయతీ తేల్చకపోవడంతో ఈ పరిస్థితి తలెత్తినట్లు బాధిత కుటుంబసభ్యులు ఆరోపిస్తున్నారు. బాధిత రైతు కుటుంబ సభ్యులు అందించిన వివరాల ప్రకారం... మండలంలోని పొట్టపెల్లి (కే) గ్రామానికి చెందిన తోడిశెట్టి భూమన్న 30 సంవత్సరాలకు పూర్వం రాచాపూర్ గ్రామానికి చెందిన రైతువద్ద వడ్యాల్ శివారులో సర్వే నెంబర్ 929, 930, 931లలో ఐదుఎకరాల భూమిని కొనుగోలు చేశాడు. ఈ భూమి పొట్టపెల్లి(కే) గ్రామానికి ఆనుకొని ఉండడంతో ఆ గ్రామస్థులు గ్రామానికి చెందిన భూమిని తొడిశెట్టి భూమన్న సాగుచేస్తున్నట్లు అనుమానించారు. గ్రామానికి చెందిన భూమి గ్రామానికి కొలిచి ఇవ్వాలని కొన్ని రోజులుగా గ్రామ వీడీసీ సభ్యులు జిల్లాస్థాయి అధికారులను కలిసి విన్న వించుకున్నారు. ఈనెల 10న జిల్లా సర్వేయర్ వచ్చి భూమి కొలతలు జరి పారు. జిల్లాసర్వేయర్ కూడా సరైన హద్దులు గుర్తించలేదని బాధిత కుటుంబసభ్యులు ఆరోపించారు. ఈ భూసమస్య పరిష్కారం కాకపోవడంతో విసుగు చెందాడు. కొందరు గ్రామస్థులు తమకు ఇబ్బందులు గురిచేస్తున్నారని తరచూ కుటుంబసభ్యులతో చర్చించేవాడన్నారు. భూమి హద్దులు తేల్చాలని తొడిశెట్టి భూమన్న ఇటీవల కోర్టులో కూడా కేసు నమోదు చేశాడు. ఈ భూ సమస్య ఇంకా పరిష్కారం కాకపోవడంతో ఆదివారం పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. గమనించిన కుటుంబసభ్యులు నిర్మల్ జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ దవాఖానాకు తరలించారు. ప్రస్తుతం అతని పరిస్థితి ఆందోళనకరంగా ఉన్నట్లు తెలిపారు.

ఇఫ్తార్ విందులో పాల్గొన్న ప్రముఖులు



ఇఫ్తార్ విందులో పాల్గొన్న నాయకులు

నిర్మల్ కల్చరల్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి) : నిర్మల్ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అర్జుమన్ అలీ, జిల్లా మైనారిటీ కాంగ్రెస్ ఆదివారం ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో పలువురు ప్రముఖులు పాల్గొన్నారు. కరీంనగర్ గ్రంథాలయ చైర్మన్ సత్తు మల్లేష్, మాజీ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి, జునైద్ మెమన్, కాంగ్రెస్ పార్టీ నాయకులు నాందేడపు చిన్ను, ఇమ్రాన్ హాజరయ్యారు.

గోదావరి పుష్కరఘాట్ వద్ద స్వచ్ఛ భారత్


పుష్కర ఘాట్‌ను శుభ్రం చేస్తున్న దృశ్యం

సోన్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి) : స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో భాగంగా సోన్ గోదావరి వద్ద ఉన్న పుష్కరఘాట్‌ల వద్ద ఆదివారం డాక్టర్ వనిత ఆధ్వర్యంలో అక్కడ పడి ఉన్న చెత్తా చెదారాన్ని శుభ్రం చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ వనిత మాట్లాడుతూ... ప్రతి ఆదివారం తమ సిబ్బందితో కలిసి పుష్కర ఘాట్లతో పాటు గోదావరి పరిసర ప్రాంతాలు అన్ని కూడా శుభ్రం చేయనున్నట్లు తెలిపారు.

అభ్యాస వర్గ కార్యక్రమం ప్రారంభం

నర్సాపూర్(జి), మార్చి 23 (ఆంధ్రజ్యోతి) : నిర్మల్ జిల్లా విశ్వహిందూ పరిషత్ అభ్యాస వర్గ కార్యక్రమం నర్సాపూర్(జీ)లో ఆదివారం ప్రారంభమైంది. ఉదయం 10 గంటలకు ఉద్ఘాటనతో ప్రారంభమై సాయంత్రం 3:30కి ముగిసింది. జిల్లా, ప్రఖండ పదాధికారులు పాల్గొన్నారు. ఇందులో విభాగ్ కార్యదర్శి తమ్మల కృష్ణ, జిల్లా అధ్యక్షులు జాదవ్ విఠల్, జిల్లా కార్యదర్శి మూర్తి, ప్రభా కర్ పాల్గొన్నారు. కార్యక్రమంలో కార్యకర్తలకు శిక్షణ ఇచ్చారు.



అభ్యాసవర్గ కార్యక్రమంలో మాట్లాడుతున్న దృశ్యం

రూ.12.34 కోట్ల ఉపాధి నిధులు మంజూరు


సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

భైంసా, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): ముథోల్ నియోజకవర్గ పరిధిలోని ఏడు మండలాల్లో వివిధ అభివృద్ధి పనులు చేపట్టేందుకు రూ.12.34కోట్ల నిధులు మంజూరైనట్లుగా బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు శంకర్ చంద్రే వెల్లడించారు. ఆదివారం భైంసాలోని కమల జిన్నింగ్ ఫ్యాక్టరీలో పార్టీ ప్రతినిధులు దేవేందర్, గన్ను నర్సారెడ్డి, బెజ్జంకి ముత్యంరెడ్డి, గంగారెడ్డి, జంగం రమేష్, మాజీ ఎంపీపీ రాంచందర్‌రెడ్డి, ఆష్టా శ్రీనివాస్‌లతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించి నిధుల వివరాలు వెల్లడించారు. మాజీ కేంద్ర మంత్రివర్యులు డా. ఎస్.వేణుగోపాలచారి ప్రతిపాదనల మేరకు రూ.7.75 కోట్లు, ముథోల్ మాజీఎమ్మెల్యే, పార్టీ ముథోల్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ నారాయణ్‌రావు పటేల్ ప్రతిపాదనల మేరకు రూ.4.39 కోట్లు మంజూరైనట్లు వివరించారు. అవసరమైన అభివృద్ధి పనుల కోసం గాను నిధుల మంజూరుకు కృషి చేసిన సీఎం రేవంత్‌రెడ్డి, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి సీతక్క, మాజీ ఎమ్మెల్యే నారాయణ్‌రావు పటేల్, మాజీ కేంద్ర మంత్రి వేణుగోపాలచారిలకు కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ధన్యవాదాలు తెలిపాయి.

నిధుల మంజూరుపై హర్షం


మాట్లాడుతున్న పార్టీ నాయకులు

తానూర్, మార్చి 23: (ఆంధ్రజ్యోతి) : తానూర్ మండలంలో రూ.కోటి 10 లక్షల ఎంజీఎన్ఆర్ఈజీఎస్ నిధులతో సీసీ రోడ్ల, డ్రైనేజీల నిర్మాణాల కోసం మంజూరు కావడంతో మండలంలోని ఆయా కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు. మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మండల అధ్యక్షులు హెచ్ పుండ్లిక్ మాట్లాడారు. సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి సీతక్క, మాజీ ఎమ్మెల్యే నారాయణ రావు పటేల్‌కు ధన్యవాదాలు తెలిపారు. కార్య క్రమంలో మాజీసర్పంచ్ మాధవరావు పటేల్, మాజీ కో-ఆప్షన్ సభ్యులు గోవింద్‌రావు పటేల్, చంద్రకాంత్ యాదవ్, బూత్ అధ్యక్షులు హనుమంత్ రావు, నాయకులు పాండు పటేల్, అంబాదాస్, ధర్మేంధర్, బాబు వాగ్మారే తదితరులున్నారు.

హైకోర్టు అడ్వకేట్ అసోసియేషన్ ఎన్నికల్లో పోటీ



లక్ష్మణచాంద, మార్చి 23 (ఆంధ్రజ్యోతి) : హైకోర్టు అడ్వకేట్ అసోసియేషన్ ఎన్నికల్లో మండలంలోని చామన్‌పెల్లి గ్రామానికి చెందిన కుమారి ఎన్‌టి.లావణ్య లేడీ ఎగ్జిక్యూటీవ్ మెంబర్‌గా పోటీ చేస్తున్నట్లు ఆదివారం స్థానికులు తెలిపారు. ఎంఏ ఎల్ఎల్‌బీ పూర్తిచేసిన ఎన్‌టి.లావణ్య ప్రస్తుతం తెలంగాణ హైకోర్టులో న్యాయవాదిగా పనిచేస్తున్నారు. చిన్న వయస్సులోనే అడ్వకేట్ అసోసియేషన్ ఎన్నికల్లో పోటీచేస్తున్న లావణ్య విజయం సాధించాలని కుటుంబ సభ్యులు, గ్రామస్థులు, స్నేహితులు ఆశిస్తూ అభినం దిస్తున్నారు.

పంటపొలాలకు వెళ్లే రోడ్ల నిర్మాణంపై ప్రత్యేక దృష్టి

●ముథోల్ ఎమ్మెల్యే రామారావ్ పటేల్


మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామారావు పటేల్

భైంసా, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): పంటపొలాలకు వెళ్లే రోడ్ల నిర్మాణంపై ప్రత్యేకదృష్టి సారించినట్లు ముథోల్ ఎమ్మెల్యే రామారావ్ పటేల్ పేర్కొన్నారు. అన్నదాతలు ఎదుర్కొంటున్న సాగుపనుల కోసం రాకపోకలు, వ్యవసాయ ఉత్పత్తుల తరలింపు సమస్యలను పరిష్కరించేందుకుగాను చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. ఆదివారం భైంసా పట్టణంలోని కిసాన్‌గల్లీలో రూ.25 లక్షలతో నూతనంగా నిర్మించిన ఆధునీక పశువైద్యశాల భవనాన్ని ప్రారంభించిన సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. పంటచేలకు సరైన రోడ్డు మార్గం లేక వ్యవసాయ ఉత్పత్తుల విషయంలో రైతులు అవస్థల పాలవుతున్నారని తెలిపారు. సంబంధిత సమస్యల పరిష్కారం కోసం గాను బీజేపీ, బీజేఎల్పీ శాసనసభ పక్ష ఉపనేత, ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్‌శంకర్ అసెంబ్లీ దృష్టికి తీసుకెళ్లారని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇందుకు సానుకూలంగా స్పందించి పంట చేలకు వెళ్లే రోడ్ల నిర్మాణంపై దృష్టి సారిస్తామని వివరించినట్లు వెల్లడించారు. నియోజకవర్గ పరిధిలో పశువైద్య శాలల ద్వారా మూగజీవాలకు మెరుగైన రీతిలో వైద్యసేవలు అందేలా కృషి చేస్తున్నామన్నారు. కుభీర్, బాసర, కల్లూర్‌లో పశువైద్యశాలల భవనాల నిర్మాణానికి త్వరలో నిధులు మంజూరయ్యేలా కృషి చేస్తానన్నారు. రైతాంగం అంతరించిపోతున్న పశుసంతతిని వృద్ధి చేసేందుకు గాను చర్యలు చేపట్టాలన్నారు. కిసాన్‌గల్లీ వాసులు సూచించిన మేరకు బాబుల్‌గాం, కమలాపూర్ వెళ్లే రోడ్ల నిర్మాణానికి చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సందర్భంగా డివిజన్ పరిధిలో మూగజీవాలకు విశిష్ఠసేవలు అందిస్తున్న భైంసా పశువైద్యాధికారి డా. విఠల్‌ను అభినందించారు. ఇందులో భైంసా ఏఎంసీ ఆనంద్ రావు పటేల్, జిల్లా పశు వైద్యాధికారి బాలిక్ హైమద్, మాజీ మున్సిపల్ చైర్మన్ గంగాధర్, డీఈ రాజేందర్‌తో పాటు బీజేపీ ప్రతినిధులు పాల్గొన్నారు.

బాసర గుడిని శుభ్రపరిచిన భక్తులు


నీటిని తొలగిస్తున్న భక్తులు

బాసర, మార్చి, 23 : (ఆంధ్రజ్యోతి) : శ్రీ ప్రణవపీఠం పీఠాధిపతి వద్దిపర్తి పద్మాకర్ శిష్య బృందం 85 మంది ఆదివారం బాసర సరస్వతి అమ్మవారి గుడిని శుభ్రపరిచారు. గోడలు, ప్రాకార మండపాలు, ఫ్లోరింగ్ అంతా దుమ్ము దులిపి గంటల పాటు శ్రమించి నీటితో కడిగారు. ఆ తర్వాత గోదావరి స్నానఘట్టాల వద్ద చెత్తాచెదారం తొలగించి పరిసరాలన్నింటినీ పారిశుద్యం లేకుండా శ్రమదానం చేశారు.

అభివృద్ధికి సహకరించాలి : ఆర్టీసీ డీఎం పండరి


డీఎంను సన్మానిస్తున్న ఉద్యోగులు

నిర్మల్‌కల్చరల్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి) : ఆర్టీసీ కార్మికులు సంస్థ అభివృద్ధికి సహకరించాలని డీఎం పండరి కోరారు. ఆదివారం కార్మికులు నూతన డీఎంను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ మజ్దూర్ సంఘం రీజియన్ కార్యదర్శి ఆర్. గంగాధర్, శేఖర్, నరేందర్, రమేష్, సుజాత, రమాదేవి, ఎజాజ్, తదితరులు పాల్గొన్నారు.

శ్రీలక్ష్మీవేంకటేశ్వర స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు

నిర్మల్ రూరల్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మూరాపూర్ శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి రెండోవార్షిక బ్రహ్మోత్సవాలు ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం ధ్వజారోహణ, అగ్నిప్రతిష్ఠ, నిత్య హవనము నిర్వహించినట్లు తెలిపారు. అదే విధంగా సోమవారం సాయంత్రం స్వామి వారి కల్యాణ మహోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆలయ అర్చకులు తెలిపారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజా కార్య క్రమాల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయచైర్మన్ కమిటీ బృందం, గ్రామ వీడీసీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.


లక్ష్మీ వెంకటేశ్వర స్వామివారు

విషాహారం తిని మూడుఎద్దులు మృతి


మృతిచెందిన ఎడ్లు

మామడ, మార్చి 23 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గాయిద్‌పెల్లి గ్రామానికి చెందిన జాదవ్ పండరి మూడు ఎద్దులు విషగుళికలు తిని ఆదివారం మృతిచెందాయి. పంట చేన్లలో మేత మేస్తుండగా ప్రమాదవశాత్తు మరణించాయా, ఏ విషఆహారం తిన్నాయో తెలియలేదు. సుమారు లక్షా 50 వేల వరకు నష్టం జరిగిందని రైతు వాపోయారు. ప్రభుత్వం స్పందించి నష్టపరిహారం చెల్లించాలని రైతు డిమాండ్ చేశారు.

భగత్‌సింగ్‌కు ఘననివాళి

నిర్మల్ కల్చరల్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి) : భగత్‌సింగ్ వర్ధంతి సందర్భంగా నిర్మల్ జిల్లా కేంద్రంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఆదివారం ఘన నివాళులర్పించారు. సీపీఐ ఎంఎల్, మాస్‌లైన్, టీయూసీఐ, పీవోడబ్ల్యూ, నాయకులు పాల్గొన్నారు. జిల్లా కార్యదర్శి కే.రాజన్న మాట్లాడుతూ... భగత్‌సింగ్ బ్రిటిష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాడినందుకే ఉరితీసిందన్నారు. బానిసత్వం నుంచి స్వేచ్ఛ, స్వాతంత్ర్యం కోసం భగత్‌సింగ్ పోరాటాడినట్టు తెలిపారు. దేశప్రజలు సంపూర్ణ స్వాతంత్ర్యం కోసం పోరాడాలని పిలుపునిచ్చారు. బక్కన్న, రామలక్ష్మణ్, ఎస్.గంగన్న, గఫార్, కే.లక్ష్మీ, గంగామణి, విజయలక్ష్మి, లలిత, కవిత పాల్గొన్నారు.

కుభీర్ మార్కెట్ కమిటీ చైర్మన్‌ను భర్తీ చేయాలి

కుభీర్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి) : కుభీర్ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవిని వెంటనే భర్తీ చేయాలని కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ ప్రెసిడెంట్ వెన్నెల సతీష్ అన్నారు. ఆదివారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. మూడు సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న ఈ పదవికి అర్హులైన గత పది సంవత్సరాల నుంచి పని చేసినటువంటి కార్యకర్తలకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ నాయకులు తదితరులున్నారు.

వాన్వాట్‌లో క్రికెట్ టోర్నీ ప్రారంభం



టోర్నమెంట్ నిర్వాహకులను సన్మానిస్తున్న దృశ్యం

ఆదిలాబాద్ రూరల్, మార్చి 23(ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ రూరల్ మండలం వాన్వాట్ గ్రామంలో ఆదివారం యూత్ ఆధ్వర్యంలో క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభమైంది. ఈ క్రికెట్ టోర్నమెంట్‌కు ముఖ్య అతిథులుగా బీజేపీ మండల అధ్యక్షులు బంతిపెల్లి దయాకర్, ప్రముఖ వ్యాపారవేత్త హిందుస్థాన్ అగ్రో సైన్స్ చైర్మన్ మస్కూరి పోతన్న హాజరై క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామీణ యువత క్రీడల్లో రాణించాలన్నారు. క్రీడలు మానసిక, శారీరక ఉల్లాసాన్ని ఇస్తాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా టోర్నమెంట్ నిర్వాహకులను శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో గ్రామస్తులు జలపతి రావు, మాధవరావ్, కేమ నందు, భీంరావ్, కేమ శ్రీకాంత్, నజీర్ పాల్గొన్నారు.

ఒకే దేశం, ఒకే ఎన్నికపై కార్యశాల

ఉట్నూర్, మార్చి 23(ఆంధ్రజ్యోతి): ఉట్నూర్‌లో ఒకే దేశం... ఒకే ఎన్నిక పైన ఆదివారం ఉట్నూర్ మండల బీజేపీ శాఖ ఆధ్వర్యంలో కార్యశాల నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా నిర్మల్ జిల్లా అధ్యక్షులు రాథోడ్‌రితేష్ హాజరై జమిలి ఎన్నికల నేపథ్యాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని బీజేపీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఒకే దేశం...ఒకే ఎన్నికతో కేంద్ర ప్రభుత్వానికి ఖర్చుభారం తగ్గుతుందని అన్నారు. ఎన్నికల నిరంతర నిర్వహణతో అధికారులకు సమయం వృథా అవుతుందని పేర్కొన్నారు. జమిలి ఎన్నికలతో భారత్ ప్రపంచ దేశాలకు దీటుగా అభివృద్ధి చెందే అవకాశం ఉందని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ నాయకులు, జిల్లా కార్యదర్శి కొండేరి రమేష్, వన్ నేషన్ వన్ ఎలక్షన్ కన్వీనర్ అమర్నాథ్, కో-కన్వీనర్ అర్జున్, మాజీ ఎంపీపీ ఆడ్‌ధన్‌లాల్ నాయక్, మాజీ వైస్ ఎంపీపీ దావులే బాలాజీ, మాజీ ఎంపీటీసీలు, రమేష్, ఎస్.రవీందర్ పాల్గొన్నారు.

'కళా రంగంలో రాణించాలి'

ఆదిలాబాద్ రూరల్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి) : కళాకారులకు మంచి అవకాశాలున్నాయని వాటిని సద్వినియోగం చేసుకొని తమను తాము నిరూపించుకొని కళారంగంలో రాణించాలని ప్రముఖ నిర్మాత డాక్టర్ రవికిరణ్ యాదవ్ అన్నారు. ఆదివారం జడ్పీ సమావేశ మందిరంలో ఆదిలాబాద్ ఫిల్మ్ సొసైటీ ఆధ్వర్యంలో తెలంగాణ భాష సంస్కృతిక శాఖ సౌజన్యంతో అవార్డుల ప్రధానోత్సవం నిర్వహించారు. సీనియర్ జర్నలిస్టులను మీడియా ఎక్సలెన్సీ అవార్డు, షార్ట్ ఫిలిం తీసిన వారికి ప్రశంస పత్రాలు అందించి సత్కరించారు. కార్యక్రమంలో సినిమి దర్శకుడు ఆకాష్ రెడ్డి, సొసైటీ అధ్యక్షులు రమేష్ గౌడ్, పలువురు కళాకారులు, షార్ట్‌ఫిల్మ్ మేకర్స్, పాత్రికేయులు నూకల దేవేందర్, కట్టా లెనిన్, రమాకాంత్ వినోద్ అత్తర్ పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

ఆదిలాబాద్ రూరల్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి) : అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని ఆదిలాబాద్ రూరల్ పోలీసులు పట్టుకున్నారు. వివరాలు.. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని 170 కాలనీ నుంచి ఆటోలో మహారాష్ట్ర వైపు తరలిస్తున్న 2.4 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని రాంపూర్ సమీపంలో పట్టుకున్నట్లు రూరల్ ఎస్సై ముజాయిద్ తెలిపారు. ఈ మేరకు ఆటో డ్రైవర్ షేక్ జహీర్‌తోపాటు ఓనరర్ సలీంపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు. అదేవిధంగా ఆటో సీజ్ చేసినట్లు తెలిపారు. పోలీస్ సిబ్బంది మంగల్ సింగ్, ముక్కె వికాస్ ఉన్నారు.

తెలంగాణ ఉద్యమకారులకు న్యాయం చేయాలి

● ఉద్యమకారుల సంఘం జిల్లా అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న భాస్కర్‌రెడ్డి

తాంసి, మార్చి 23(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర సాధనలో అనేకమార్లు జైలు పాలై ఉద్యమం చేసిన ఉద్యమకారులకు న్యాయం చేయాలని ఉద్యమకారుల సంఘం జిల్లా అధ్యక్షుడు గుంజాల భాస్కర్ రెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి హాజరైన ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో తమ పాత్ర ఎంతో ఉందన్నారు. అనేకసార్లు జైలు పాలై పూట గడవని స్థితిలో కూడా తాము పోరాటం చేశామన్నారు. అయితే కొంత మంది ఉద్యమకారులకు మాత్రమే న్యాయం జరిగిందని తమలాంటి అనేక మందికి న్యాయం జరగలేదని అన్నారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం తమకు న్యాయం చేయాలని కోరారు. పల్లె పల్లెనా తెలంగాణ ఉద్యమ చరిత్రను ప్రతిబింబించేలా కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. ప్రతి ఒక్కరూ తమకు సహకరిస్తున్నందుకు అభినందనలు తెలిపారు. కార్యక్ర మంలో ఉద్యమకారుల సంఘం నాయకులు నాగ రెడ్డి, శ్రీనివాస్, రవీందర్, ఆశన్న, మహేందర్, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తో అన్ని వర్గాల అభివృద్ధి

● నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్



సీసీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఆడే గజేందర్

తలమడుగు, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): బడుగు, బలహీన వర్గాల అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యమని బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్ అన్నారు. ఆదివారం తలమడుగు మండలం పల్లి(బీ) గ్రామంలో ఈజీఎస్ నిధుల నుంచి మంజూరైన ఆరు లక్షల 50 వేల రూపాయల సీసీ రోడ్డు పనులకు, లచ్చంపూర్ గ్రామంలో మూడులక్షల సీసీ రోడ్డు పనులకు, తలమడుగు మండల కేంద్రంలో 8 లక్షల సీసీ రోడ్డు పనులకు బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ఆడే గజేందర్ పూజలు చేశారు. మొత్తం మూడు కోట్ల రూపాయలు సీసీ రోడ్లకు మంత్రి సీతక్క సహకారంతో మంజూరు చేయించానని భవిష్యత్తులో కూడా మండలాన్ని అన్ని రకాల అభివృద్ధి చేస్తానని ప్రజలకు హామీనిచ్చారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ గోక గణేష్‌రెడ్డి, మాజీ ఎంపీపీ కళ్యాణం లక్ష్మీ రాజేశ్వర్, బోథ్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు బద్దం పోతారెడ్డి నాయకులు పాల్గొన్నారు.

నేరడిగొండ : తేజాపూర్ గ్రామ పంచాయితీ పరిధిలో ఎన్ఆర్ఈజీఎస్ నిధుల నుంచి 20 లక్షల రూపాయలతో సీసీ రోడ్లు, డ్రైనేజీల పనులను బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్ ప్రారంభించారు. నియోజకవర్గంలో ప్రతి గూడెంలో రోడ్లు వేసే బాధ్యత తీసుకుంటానని అన్నారు. మంత్రి సీతక్కకి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఆయన వెంట బోథ్ నియోజకవర్గ యువజన అధ్యక్షుడు బద్దం పోతారెడ్డి, సీనియర్ నాయకులు పాల శంకర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

బోథ్ : నియోజకవర్గ పరిధిలోని అన్ని గ్రామాలను కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ హయాంలో దశల వారీ అభివృద్ధి చేస్తామని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్ పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని పొచ్చెర ధన్నూర్ గ్రామాలలో సీసీ రోడ్డు పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వానికి నిధుల ఇబ్బందులు ఉన్న ప్రణాళికబద్ధంగా పనులను పూర్తి చేస్తామన్నారు.

'పసిడి వాడకాన్ని తగ్గించండి'

ఉట్నూర్, మార్చి23 (ఆంధ్రజ్యోతి): పసిడి వాడకాన్ని తగ్గించి, వెండి ఆభరణాలను ఎక్కువగా ఉపయోగించుకోవాలని లంబాడా హక్కుల పోరాట సమితి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ భరత్‌చౌహాన్ అన్నారు. జిల్లాలోని అన్ని తండాల నాయక్ కార్బరి, డావ్, గేరియా మహారాజ్ జిల్కరి, కవులు గోర్ భజన్ బోలేవాల్ భగత్, భజన్‌కారి మహారాజులు, మేధావులతో జగదాంబాదేవి మందిరంలో ఆదివారం సమావేశం నిర్వహించామన్నారు.

మహిళను కాపాడిన సిబ్బంది

బోథ్, మార్చి23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పొచ్చెర జలపాతం వద్ద ఆత్మహత్య చేసుకునేందుకు వచ్చిన ఓ మహిళను అక్కడి కాపలా సిబ్బంది ఆదివారం ఉదయం కాపాడారు. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి... మండల కేంద్రానికి చెందిన ఓ మహిళ ఆదివారం ఉదయం పూట తమ ఇంట్లో గొడవపడి జలపాతం వద్దకు ఆత్మహత్య చేసుకునేందుకు వచ్చింది. అక్కడే ఉన్న సిబ్బంది గమనించి ఆమెను పట్టుకొని వెనక్కి తీసుకువచ్చారు. ఆత్మహత్య చేసుకోవడానికి గల కారణాలు ఏమిటి అని అడిగారు. విషయం తెలుసుకుని ఆమె కుమారుని ఫోన్ ద్వారా సమాచారం అందించడంతో సదరు మహిళను ఇంటికి తీసుకువెళ్లారు. సిబ్బందిని పలువురు అభినందించారు.

ఏఎన్ఎంలకు ఉద్యోగ భద్రత కల్పించాలి

ఆదిలాబాద్ రూరల్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని సీఐటీయూ కార్యాలయంలో ఏఎన్ఎంల జనరల్ బాడీ సమావేశం ఆదివారం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కిరణ్ మాట్లాడుతూ.. ఐటీడీఏ పరిధిలోని విద్యార్థుల పాఠశాలల్లో పని చేస్తున్న ఏఎన్ఎంలకు పూర్తిస్థాయిలో వేతనాలు చెల్లించని కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలన్నారు. వారి సమస్యలు పరిష్కరించి ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు.

ఓటేయడానికి వేములవాడ బయలుదేరిన నాయకులు

ఆదిలాబాద్ రూరల్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి) : ఓం శివ మహేశ్వర మాల జంగం రాష్ట్ర సంఘం కార్యవర్గం కాలపరిమితి ముగియడంతో నూతన కార్యవర్గం ఎన్నిక కోసం ఇటీవల నోటిఫికేషన్ విడుదల చేశారు. అధ్యక్ష, కార్యదర్శి పదవుల కోసం పలువురు పోటాపోటీగా నామినేషన్ వేశారు. ఈ రాష్ట్ర ఎన్నికలు ఆదివారం వేములవాడలో నిర్వహించగా బ్యాలెట్ ప్రక్రియ ద్వారా సజావుగా సాగింది. ఈ నేపథ్యంలో ఆదిలాబాద్ నుంచి సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గాజరి వినోద్, దేవల్ల శంకరయ్యతోపాటు 16 మంది సభ్యులు ప్రత్యేక వాహనంలో వేములవాడకు పయనమయ్యారు.

'అక్రమంగా గంజాయి సాగుచేస్తే చర్యలు తప్పవు'

నేరడగొండ, మార్చి 23: అక్రమంగా గంజాయి సాగుచేస్తే చర్యలు తప్పవని ఆదివారం ఇచ్చోడ సీఐ భీమేష్ అన్నారు. మండలంలోని కోర్టికల్ గ్రామశివారులో లింగట్ల గ్రామానికి చెందిన అమర్‌సింగ్ అనే రైతు అటవీ భూమిలో కోర్టికల్ గ్రామానికి చెందిన పడ్వాల్ దశరథ్, అతని భార్య పడ్వాల్ సాగర్‌బాయిలు గతమూడు సంవత్సరాల నుంచి కౌలు చేస్తున్నారు. ప్రస్తుతం మిరప, వంకాయ బెండకాయతో పాటు అంతర పంటగా గంజాయి సాగు చేయగా నేరడిగొండ ఎస్ఐ శ్రీకాంత్‌తో పాటు సిబ్బందితో కలిసి దాడిచేసి గంజాయి పంటను స్వాధీనం చేసుకున్నామన్నారు. పడ్వాల్ దశరథ్ అతని భార్య సాగర్ బాయిలపై కేసునమోదు చేశామన్నారు, దశరథ్ పరారీలో ఉన్నాడని పట్టుకున్న 17 గంజాయి మొక్కల విలువ లక్షా డెబ్బైవేలవరకు ఉంటుందని సీఐ భీమేష్ అన్నారు. ఎవరైనా అక్రమంగా గంజాయి సాగు చేసినా, విక్రయించినా చర్యలు తప్పవని సీఐ ఈ సందర్భంగా హెచ్చరించారు.

అందనంత దూరం.. పశువైద్యం!!

(5వ పేజీ తరువాయి...)

పశువుల ఆసుపత్రికి సైతం ఇన్‌చార్జీ డాక్టర్ ఉండడంతో పశువులకు సరైన విధంగా సేవలు అందడం లేదని రైతులు వాపోతున్నారు.

కొత్త ఆసుపత్రుల జాడేదీ?

జిల్లాలో లక్షలాదిగా పశుసంతతి ఉన్నా.. పశువైద్యం అందించడానికి ప్రభుత్వాలు కొత్త ఆసుపత్రులను మంజూరు చేయడం లేదని రైతులు అంటున్నారు. మూడు దశాబ్దాల క్రితం ఏర్పాటు చేసిన పశువైద్య కేంద్రాలను కొనసాగిస్తున్నా.. ప్రభుత్వాలు కొత్త ఆసుపత్రుల ప్రతిపాదనలను పెండింగ్‌లోనే ఉంచుతున్నాయి. ఉట్నూర్ మండలంలోని దంతన్‌పల్లి, బీర్సాయిపేట, దర్మాజిపేట్, కొత్తగూడ, కోలాంగూడ, నర్సాపూర్, చెరువుగూడ, మొర్రిపేట్, భూపేట్, ఘన్పూర్, చింతగూడ, కల్లూరుగూడ, హస్నాపూర్, చాందూరి, శంకర్‌తండా, శ్యాంనాయక్ తండా, దుర్గాపూర్, మత్తడిగూడ, తదితర ప్రాంతాల రైతుల పశువుల వైద్యం కోసం దంతన్‌పల్లి, హస్నాపూర్‌లలో ప్రాథమిక పశువైద్య కేంద్రాలు ఏర్పాటు చేయాలని మూడు దశాబ్దాలుగా కోరుతున్నా.. రైతుల కోరిక నెరవేరడం లేదు. ఈ ప్రాంత రైతులు తమ పశువులను ఉట్నూర్ డివిజన్ కేంద్రంలోని ఏరియా పశువుల ఆసుపత్రికి తీసుకువస్తే ఈ గ్రామాలు షాంపూర్ గ్రామీణ పశువైద్య కేంద్రం పరిధిలోకి వస్తాయని తెలపడంతో 20 కి.మీ.ల దూరంలో ఉన్న పశువుల ఆసుపత్రికి వెళ్లలేక రైతులు పశువులకు వైద్యం అందించ లేకపోతున్నారు.

మరమ్మతులకు నోచుకోని కేంద్రాలు

ఐదు దశాబ్దాల క్రితం నిర్మించిన ఉట్నూర్ డివిజన్ కేంద్రంలోని పశువైద్య కేంద్రం భవనం శిథిలదశకు చేరుకున్న భవనం స్థానంలో కొత్త భవనం మంజూరు చేయాలని ప్రతిపాదనలు పంపించారు. అయినా ప్రతిపాదనలు రెండు దశాబ్దాలుగా పెండింగ్‌లోనే ఉన్నాయి. బోథ్ మండలంలోని కౌట(బి)లో పశువైద్య కేంద్రానికి భవనం లేదు. అదేవిధంగా బేల మండలంలోని సాంగిడిలో భవనం కరువే కావడంతో కిరాయి ఇళ్లలో కొనసాగుతున్నాయి. సిరికొండ మండల కేంద్రంలో పశువైద్య కేంద్రానికి సొంత భవనం ఉన్నప్పటికీ.. ఈ భవనాన్ని నూతన మండల రెవెన్యూ కార్యాలయానికి జిల్లా అధికారులు అప్పగించడంతో పశువుల ఆసుపత్రి అద్దె భవనంలో కొనసాగుతోంది.

జిల్లాలో పశువులు ఫుల్

జిల్లాలోని ఆదిలాబాద్ మండలంలో 34 వేల పశువులు ఉండగా బజార్‌హత్నూర్ మండలంలో 16 వేలు ఉన్నాయి. అలగే బేల మండలంలో 16 వేలు, భీంపూర్ మండలంలో 15 వేలు, బోథ్ మండలంలో 17 వేలు, గాదిగూడ మండలంలో 27 వేలు, గుడిహత్నూర్ మండలంలో ఏడు వేలు, ఇచ్చోడ మండలంలో 13 వేలు, ఇంద్రవెల్లి మండలంలో 25 వేలు, జైనథ్ మండలంలో 26 వేలు, మావల మండలంలో 738, నార్నూర్ మండలంలో 12 వేలు, నేరడిగొండ మండలంలో 22 వేలు, సిరికొండ మండలంలో 8600, తలమడుగు మండలంలో 15900, తాంసి మండలంలో 8 వేలు, ఉట్నూర్ మండలంలో 37 వేల వంతున ఎద్దు, ఆవులు తెల్లవి ఉన్నాయి. వీటికి తోడు జిల్లావ్యాప్తంగా 48 వేలు మాత్రమే పాడి గేదెలు, 1.53 లక్షల గొర్రెలు, 1.86 లక్షల మేకలు ఉన్నాయి.

ఐటీడీఏలో కనుమరుగైన పశు సంవర్ధక శాఖ

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని గిరిజనుల సమగ్ర అభివృద్ధి కోసం ఉట్నూర్ కేంద్రంగా ఏర్పాటు చేసిన ఐటీడీఏలో తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటు అయ్యాక పాలకులు ఐటీడీఏలో ఉన్న పశు సంవర్ధక శాఖను ఎత్తివేశారు. ఫలితంగా ఉమ్మడి జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతాలలో ఉన్న గిరిజన రైతులకు పాడి గేదెలు, దుక్కిటి ఎద్దులు అందించే కార్యక్రమాలు సన్నగిల్లాయి. దీనికి తోడు పాడి పశువుల అభివృద్ధి కోసం, గిరిజన రైతుల కోసం ఏర్పాటు చేసిన శిక్షణ కేంద్రాలు సైతం మూతబడ్డాయి. ఇప్పటికైనా ఐటీడీఏలో పశుసంవర్ధక శాఖను ఏర్పాటు చేసి గిరిజన రైతులకు ప్రయోజనాలు కల్పించాలని రైతులు కోరుతున్నారు. అదేవిధంగా గ్రామీణ ప్రాంతాలలోని పశువులకు కావాల్సిన వైద్య సేవలు అందుబాటులోకి తేవాలని అంటున్నారు.

పెంబి అటవీశాఖ ఆధ్వర్యంలో ఉచిత మెడికల్ క్యాంప్



ఫారెస్ట్ ఆధ్వర్యంలో ఉచిత మెడికల్‌క్యాంప్ నిర్వహిస్తున్న వైద్యులు

పెంబి, మార్చి 23 (ఆంధ్రజ్యోతి) : ప్రపంచ అటవీ దినోత్సవ వేడుకల్లో భాగంగా మండల కేంద్రంలోని బస్టాండ్ సమీపంలో పెంబి ఫారెస్ట్ రేంజ్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత మెడికల్ క్యాంప్ నిర్వహించారు. మారుమూల గిరిజన గ్రామాల నుంచి ప్రజలు వచ్చి రక్త పరీక్షలు చేసుకొని, మందులు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఎఫ్ఆర్‌వో రమేష్ రావు మాట్లాడుతూ... ఆరోగ్యం కాపాడుకోవడంలో ప్రతి ఒక్కరూ లక్ష్యంగా ఉండాలన్నారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలన్నారు. అలాగే పర్యావరణం కాపాడాలని సూచించారు. కార్యక్రమంలో లలిత మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి వైద్యులు మహేష్ బాబు, శ్వేత, హరికృష్ణ, సురేష్, ఫారెస్ట్ అధికారులు డీఎఫ్ఆర్‌వో ప్రతాప్ నాయక్, ఎఫ్ఎస్‌వో సుధాకర్, ఎఫ్‌బీవోలు స్రవంతి, శ్రీనివాస్, కిరణ్, గంగారాం, ఆశిష్, నరేష్, తదితరులున్నారు.

నివాళులర్పించిన టీజీవీపీ



నివాళులర్పిస్తున్న టీజీవీపీ

నిర్మల్ కల్చరల్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి) : భగత్ సింగ్ వర్ధంతి సందర్భంగా ఆదివారం టీజీవీపీ నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి కే.ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ... భగత్‌సింగ్ ఆశయాలు సాధిం చినందుకు ఆయనను స్ఫూర్తిగా తీసుకోవాలని యువత, విద్యార్థులకు పిలుపునిచ్చారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



వేదికపై పూర్వ విద్యార్థులు

నిర్మల్ కల్చరల్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి) : నిర్మల్ పట్టణం రవి ఉన్నత పాఠశాలలో 2000-01 బ్యాచ్ ఎస్ఎస్‌సీ పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం నిర్వహించారు. 25 సంవత్సరాల (సిల్వర్ జూబ్లీ) తరువాత కలుసుకున్న వారంతా పాత జ్ఞాపకాలు నెమరు వేసుకున్నారు. ప్రస్తుతం నిర్వహిస్తున్న ఉద్యోగ విశేషాలు పంచుకున్నారు. కరస్పాండెంట్ వెంకటేశ్వర్ రావు, రాణి, శ్రీనివాస్ రెడ్డి, శ్రీనివాసాచారి, మోహన్ రావు, మునిందర్, తదితరులు పాల్గొన్నారు.

ఆశ కార్యకర్తల ముందస్తు అరెస్ట్



లక్ష్మణచాందలో అరెస్ట్ అయిన కార్యకర్తలు

నిర్మల్‌రూరల్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఆశా కార్యకర్తలను ఆదివారం పోలీసులు ముందుస్తుగా అరెస్ట్ చేశారని తెలిపారు. ఈ సందర్భంగా ఆశా కార్యకర్తలు మాట్లాడుతూ... ఆశావర్కర్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఈ నెల 24న చలో హైదరాబాద్ కార్యక్రమంటూ పోలీసులు అత్యుత్సాహంతో ఆశావర్కర్లకు ఇబ్బంది కలిగించే విధంగా ఇళ్లకు ఉదయం 4 గంటల నుంచి వెళ్లి అరెస్ట్ చేయడాన్ని ఖండిస్తున్నట్లు, ఆశలకు వారి కుటుంబంలో ఎటువంటి ఇబ్బంది వచ్చిన దానికి ప్రభుత్వమే బాధ్యత వహించాలని తెలిపారు. కార్యక్రమంలో ఆశా యూనియన్ జిల్లా అధ్యక్షురాలు సుజాత, మంగ లావణ్య, సునీత, ఊర్మిళ, అమృత, సుశీల, అనురాధ, లావణ్య, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

లోకేశ్వరం : మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో పనిచేస్తున్న ఆశా కార్యకర్తలను ముందస్తుగా లోకేశ్వరం ఎస్సై అశోక్ ఆదివారం అరెస్ట్ చేశారు. అసెంబ్లీని ముట్టడించే క్రమంలో వీరిని ముందస్తు అరెస్ట్ చేశామని లోకేశ్వరం ఎస్సై అశోక్ కుమార్ తెలిపారు. పోలీస్ సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

లక్ష్మణచాంద : మండలంలోని పలువురు ఆశా కార్యకర్తలను పోలీసులు ఆదివారం ముందస్తు అరెస్ట్ చేశారు. హైదరాబాద్‌లో కోఠిలో గల ఆరోగ్య శాఖ కమిషనర్ ఆఫీస్ ముందు సోమ వారం నిర్వహించే ధర్నాకు వెళ్లకుండా అడ్డుకునే కార్యక్రమంలో భాగంగా ఈ అరెస్టులు చేశారు. అరెస్ట్ అయిన వారిలో ఆడెపు శారద, దొంతుల లక్ష్మీ, విజయ, రత్నమాల, వనిత, తదితరులు ఉన్నారు.

సోన్ : మండలంలోని ఆశా కార్యకర్తలను ఆదివారం పోలీసులు ముందస్తుగా అరెస్ట్ చేశారని తెలిపారు. ఈ సందర్భంగా ఆశా కార్యకర్తలు మాట్లాడుతూ... ఆశా వర్కర్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఈ నెల 24న చలో హైదరాబాద్ కార్యక్రమం ఉంటే పోలీసులు అత్యుత్సాహంతో ఆదివారం ఆశా వర్కర్లకు ఇబ్బంది కలిగించే విధంగా ఇళ్లకు వెళ్లి అరెస్ట్ చేయడాన్ని ఖండిస్తున్నట్లు తెలిపారు. కరోనా టైంలో ఆదుకున్న సేవలను గుర్తించిన ప్రభుత్వాలే మా ఉద్యమాన్ని అణచి వేసే ధోరణిలో ప్రభుత్వ వ్యవహరిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

బాసరలో బీజేపీ కార్యకర్తల సమావేశం



బాసరలో సమావేశం అనంతరం నినదిస్తున్న బీజేపీ కార్యకర్తలు

బాసర, మార్చి, 23 : (ఆంధ్రజ్యోతి) : బాసర మండల కేంద్రంలో ముధోల్ నియోజకవర్గ ఇన్‌చార్జీ చిన్నారెడ్డి, మండల కన్వీనర్ నరేష్ రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం కార్యకర్తల సమావేశం జరిగింది. ఒకే దేశం- ఒకే ఎన్నిక ఎజెండాతో సమావేశం నిర్వహించారు. దేశంలో అన్ని ఎన్నికలు ఒకేసారి జరుగడం వల్ల కలిగే ప్రయోజనాలు, పరిపాలన సౌలభ్యత గురించి కార్యకర్తలకు వివరించారు. ప్రస్తుతం విడివిడిగా జరుగుతున్న ఎన్నికల వల్ల ఏర్పడుతున్న సమస్యలు, నష్టాల గురించి సైతం తెలియజేశారు. ఈ విషయాన్ని ప్రతి స్థాయిలో ప్రజలకు తెలియజేయాలని కార్యకర్తలకు సూచించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు సతీశ్వర్ రావు, వీ. సాయినాథ్, డీ. శంకర్, సాయినాథ్, నర్సింగ్ రావు, బీ. రమేష్, శ్రీనివాస్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

వడ్డెరల జీవితాలు మారడం లేదు

● వడ్డెర సంఘ అధ్యక్షుడు డాక్టర్ వెంకటేష్ మౌర్య

నిర్మల్ కల్చరల్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి) : తెలుగు రాష్ట్రాలో వడ్డెర కులస్తులను బీసీ జాబితాలో చేర్చడం తీరని అన్యాయమని జాతీయ వడ్డెర సంఘం అధ్యక్షుడు డాక్టర్ వెంకటేష్ మౌర్య అన్నారు. ఆదివారం టీఎన్జీవో సంఘ భవనంలో జిల్లా ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... మౌర్య ప్రభుత్వాలు మారినా వడ్డెర కులస్తుల జీవితాలు మారడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. వివిధ రాష్ట్రాల్లో వడ్డెర కులస్తులు ఎస్సీ, ఎస్టీ, డీఎన్‌డీలుగా ఉన్నారని స్పష్టం చేశారు. వడ్డెరలను ఎస్టీ జాబితాలో చేర్చాలని పలుమార్లు వినతి పత్రాలు ఇచ్చినా పట్టించుకోవడం లేదన్నారు. తెలంగాణ ప్రభుత్వం బిల్లు పెట్టి కేంద్రానికి పంపించాలని కోరారు.

'లైఫ్ సర్టిఫికెట్లు ఇవ్వండి'

నిర్మల్ కల్చరల్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి) : ఇప్పటి వరకు లైఫ్ సర్టిఫికెట్లు ఇవ్వని వారు వెంటనే ఇవ్వాలని ఆ సంఘం అధ్యక్షుడు ఎంసీ లింగన్న ఒక ప్రకటనలో కోరారు. నిర్మల్ ఎస్టీవో పరిధిలో 400 వరకు సర్టిఫికెట్లు ఇవ్వలేదన్నారు. ఇవ్వని వారికి ఏప్రిల్ తరువాత పెన్షన్ మంజూరు చేయబడవని తెలిపారు.

పోచమ్మ దేవాలయంలో పూజలు

సారంగాపూర్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అడెల్లి పోచమ్మ దేవాలయంలో ఆదివారం భక్తులు పోచమ్మ తల్లి దీవించు తల్లి అంటూ మొక్కు లను మొక్కారు. ఈ ఆలయానికి ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్, కరీంనగర్ జిల్లాల నుంచే కాకుండా మహారాష్ట్ర నుంచి అధికసంఖ్యలో భక్తులు హాజరై అమ్మవారికి మొక్కులను తీర్చుకుంటారు. నైవేద్యం సమర్పించారు. ఆలయానికి మొక్కులను తీర్చుకోవడానికి వచ్చిన భక్తులు ఎలాంటి ఇబ్బందులను ఎదుర్కోకుండా ఉండడానికి ఆలయ ఇన్‌చార్జి ఈవో రంగు రవి కిషన్ గౌడ్‌లు అన్ని ఏర్పాట్లను చేశారు. మొక్కులు తీర్చుకోవడానికి వచ్చిన భక్తులు జాతకాలను సరిచూసుకున్నారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉండడంతో ఆలయానికి మొక్కులు తీర్చుకోవడానికి వచ్చిన భక్తులు ఇబ్బందులను ఎదు ర్కొన్నారు. అలాగే ఆలయం వద్ద తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకున్నారు. నిర్మల్ భైంసా డిపోల నుంచి అధిక సంఖ్యలో బస్సు సౌకర్యాలను కల్పించారు.

రోడ్డు ప్రమాదంలో యువకులకు గాయాలు

భైంసా రూరల్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వానల్‌పాడ్ గ్రామ సమీపంలో ఆదివారం డివైడర్‌ను ఢీకొని యువకులు గాయాలపాలయ్యారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... రాంపూర్, చర్లపల్లి గ్రామానికి చెందిన సాయన్న, రఫీక్ సొంత పనుల కొరకు సుంక్లీ గ్రామానికి వెళ్లి తిరుగు ప్రయాణంలో వానల్‌పాడ్ గ్రామ సమీపంలో డీవైడర్‌ను ఢీకొని గాయాలపాలయ్యారు. ఘటనా స్థలానికి సీఐ నైలు చేరుకొని వెంటనే అంబులెన్స్ ద్వారా భైంసా ఏరియా ఆసు పత్రికి తరలించారు. స్థానికులు సీఐ నైలును అభినందించారు.

అమరులకు ఘన నివాళి



నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

కుంటాల, మార్చి, 23 : (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం కుంటాల లోని సృజనా విద్యానిలయంలో ఆదివారం షాహిద్ దినోత్సవాన్ని పురస్కరించుకొని స్వాతంత్ర వీరులైన భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్ చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ కొత్తకాపు గంగన్న మాట్లాడుతూ భారత స్వాతంత్ర ఉద్యమంలో పోరాడిన అత్యంత ప్రభావశీల విప్లవకారులలో వీరి పాత్ర కీలకమైందని, వీరు ముందు వరుసలో ఉండి పోరాడారని, వీరి ధైర్యం, ఆవేశం, ఆలోచనలు భారత దేశ యువతకు స్ఫూర్తినిస్తూనే ఉంటాయన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు.

సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం



సీఎం క్షీరాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

కడెం, మార్చి 23 (ఆంధ్రజ్యోతి) : మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో స్థానిక ఇందిరమ్మ విగ్రహం వద్ద కాంగ్రెస్ నాయకులు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి సీతక్క, ఎమ్మెల్యే బొజ్జు పటేల్ చిత్ర పటాలకు క్షీరాభిషేకం చేశారు. అనంతరం ఏఎంసీ చైర్మన్ పడిగెల భూషణ్ మాట్లాడుతూ... ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత, అలాగే 42 శాతం బీసీలకు రిజర్వేషన్ బిల్లు శాసనసభలో ఆమోదింపజేసి దేశానికి మార్గం చూపిన సందర్భంగా ప్రజా ప్రభుత్వానికి ధన్యవాదములు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు మల్లేష్, జిల్లా కాంగ్రెస్ నాయకులు పొద్దుటూరి సతీష్ రెడ్డి, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు టి. శంకర్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు యాదగిరి నారాయణ, జలజ, నాయకులు కొండాపురం లక్ష్మణ్, బొడ్డు గంగన్న, ముస్కు రాజు, లచ్చన్న, కోల శ్రీనివాస్, తిరుపతి రెడ్డి, గాండ్ల శేఖర్, బబ్లు, రహీం, తదితరులు పాల్గొన్నారు.

25న ఉట్నూర్ వారసంతా, దినసంతలకు బహిరంగ వేలం

ఉట్నూర్, మార్చి23 (ఆంధ్రజ్యోతి): ఉట్నూర్ పట్టణంలోని మేజర్ గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో ప్రతి ఆదివారం జరిగే వారసంతతో పాటు దినసంత బహిరంగ వేలం ఈ నెల 25న నిర్వహిస్తున్నట్లు పంచాయతీ కార్యదర్శి శంకర్ ఒక ప్రకటనలో తెలిపారు. దినసంతకు రూ.25వేలు, వార సంతకు రూ.50వేలు ధర వత్తు ఉదయం 8గంటల నుంచి 10.30గంటల వరకు డిపాజిట్ చేయాలన్నారు. మిగత వివరాలకు కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

దరఖాస్తులు ఆహ్వానం

ఆదిలాబాద్ అర్బన్, మార్చి23 (ఆంధ్రజ్యోతి): ఆర్థికంగా వెనుకబడిన తరగతులు(ఈబీసీ), నిరుద్యోగ యువతి యువకులకు రాజీవ్ యువ వికాసం పథకం కింద ఆర్థిక సహాయం పొందేందుకు ఈ నెల 23 నుంచి ఏప్రిల్ 5 వరకు దరఖాస్తులు చేసుకోవాలని జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి రాజలింగుల ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కలిగిన నిరుద్యోగ యువతి యువకులు ఆన్‌లైన్‌లో మాత్రమే దరఖాస్తులను చేసుకోవాలన్నారు.

గజ్జలమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు



పూజలు నిర్వహిస్తున్న భక్తులు

కుంటాల, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం కుంటాల స్థానిక గజ్జలమ్మ ఆలయంలో ఆదివారం భక్తజనం పోటెత్తింది. మండలంలోని నలుమూలల నుంచే కాకుండా పక్క మండలాల నుంచి సైతం భక్తులు అధిక సంఖ్యలో వచ్చి గజ్జలమ్మ ఆలయ ప్రాంగణంలో గజ్జలమ్మకు ప్రీతికరమైన నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయానికి వచ్చిన భక్తులకు నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు.

అపూర్వం.. విద్యార్థుల సమ్మేళనం



సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

తాంసి, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): తాంసి జడ్పీహెచ్ఎస్ 2002-03 బ్యాచ్‌కు చెందిన 10వ తరగతి విద్యార్థులు ఆదివారం అదే పాఠశాలలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా తమకు విద్యాబుద్ధులు చెప్పిన ఉపాధ్యాయులకు శాలువాలు కప్పి, జ్ఞాపికలు అంద జేసి సన్మానించారు. అనంతరం అప్పటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ఒకరినొకరు అప్యాయంగా పలకరించుకున్నారు.



ప్యాకింగ్‌లో ఆకర్షిస్తున్న అత్తరు బాక్స్‌లు





సీసాలలోని అత్తరు నిల్వలు

గుభాళిస్తున్న అత్తరు పరిమళాలు

● రోజురోజుకు పెరుగుతున్న ఆదరణ ● రంజాన్‌లో అధికంగా వినియోగం



భైంసా, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రధాన మార్కెట్లలో అత్తరు పరిమళాలు గుభాళిస్తున్నాయి. అన్ని వర్గాల వారు వీటి వినియోగం పట్ల మక్కువ చూపుతుండటంతో రోజురోజుకు ఆదరణ ఇంతకింతకి పెరుగుతోంది. ప్రస్తుతం రంజాన్ సీజన్ కొనసాగుతుండటంతో ముస్లిం అత్తరును అధికంగా వినియోగిస్తున్నారు. రంజాన్ నెలలో వీటి వాడకం ఇతర నెలలో పోల్చి చూస్తే జోరుగా ఉంటుంది. ప్రస్తుతం మతాలకతీతంగా అన్నివర్గాల ప్రజలు అత్తర్‌లను వినియోగి స్తున్నారు. ఇటీవలికాలంలో ముఖ్య పండుగలు, పెళ్లిళ్ల సీజన్లలో వీటి విక్రయాలు భారీ స్థాయిలో ఉంటున్నాయడంలో సందేహం లేదు. దీన్ని బట్టి అత్తరుకు ఇచ్చే ప్రాధాన్యమేంటో చెప్పకుండానే తెలిసిపోతుంది.



మార్కెట్లో లభ్యమవుతున్న పలు రకాల అత్తర్లు



సీజన్‌ల వారీగా..

అన్ని రకాల అత్తరులను నిత్యం వినియోగించలేం. వాడే పద్ధతి తెలియక సమయం కాని సమయంలో ఒంటికి పూసినా, వాసన పీల్చినా అనర్థాలు కలిగే అవకాశం ఉంది. చలి, వర్షాకాలంలో షమామతుల్ అంబర్, హీన, జాఫ్రాన్, మిష్క్ దహనుల్ ఊద్ వంటివి వాడాలి. ఇవి వెచ్చదనాన్ని ఇస్తాయి. వేసవిలో ఖస్, ఇత్రేఫిల్ చాలా మంచివి. ఇవి రెండు చల్లదనాన్ని ఇస్తాయి. ఇత్రేఫిల్ మట్టి వాసనను ఇస్తూ చల్లదనాన్ని కలిగిస్తుంది.

ఎక్కడ తయారువుతున్నాయంటే..

ఉత్తరప్రదేశ్‌లోని ఖన్నేజ్ ప్రాంతంలో అత్తరు ఎక్కువగా తయార వుతుంది. అత్తరు ఎంత ఎక్కువ కాలం భద్రపరిస్తే అంత సువాసను వెదజల్లుతుంది. ధర కూడా ధర కూడా నిలువ కాలాన్ని బట్టి ఉంటుంది. నకిలీదైతే కొంత కాలంలోనే వాసనలో వ్యత్యాసాన్ని గమనించవచ్చు. వీటిని తోలుతో చేసిన కుప్పిలలో ఒక ప్రాంతం నుంచి వేరొక ప్రాంతానికి రవాణా చేస్తారు. వీటిలో ఎక్కువ రోజుల పాటు భద్రపరచవచ్చు. ఏ మాత్రం తేడా ఉండదు. ప్రస్తుతం అల్యూమినియం డబ్బాలను రవాణాకు వినియోగిస్తున్నారు. గాజు పాత్రలు మంచివే అయినా, ఒక ప్రాంతం నుంచి ఇంకో ప్రాంతానికి తరలించడం కష్టంతో కూడు కున్నపని. పురాతన కాలంలో కొంతమంది తమకు నచ్చిన అత్తరులను తయారు చేయించి పెద్ద డ్రమ్ములలో నిల్వ ఉంచుకునే వారు. అవి చాలాకాలం పాటు నిల్వ ఉండేవి.

రకాలు

అత్తరులలో అనేక రకాలు ఉన్నాయి. వాటిలో జన్నతుల్ పిర్ దోస్, పహాడ్‌ఫూల్, హరాగులాబ్, అరూస, నౌషాద్, నఫీస్, గజ్రా, మాక్సీ, మజ్మ, షాజహాన్, తమన్నా, నాయట్, హోప్, బఖూర్, మొఖల్లత్, ఇత్రే ఫిల్, షమామతుల్ అంబర్, హీన, జాఫ్రాన్, మిష్క్, దహనుల్, ఊద్, రోజ్, కచ్చికలి ముఖ్యమైనది. కృత్రిమంగా తయారుచేసేవి ఎన్ని ఉన్నా పెట్టిన మరుక్షణమే వాసన పోయేవి ఉన్నాయి. అసలు సిసలైన అత్తరు అంటే ఒకసారి పూసుకున్నాక రెండు, మూడుసార్లు దుస్తులు ఉతికినా దాని పరిమళం మాత్రం త్వరగా పోదు.

అందుబాటులో విదేశీ అత్తర్లు

జిల్లాలోని భైంసా, నిర్మల్, ఖానాపూర్,బాసర తదితర ప్రధాన మార్కెట్లలో దేశీయ అత్తర్లతో పాటు విదేశీ అత్తర్లు అందుబాటులో ఉన్నాయి. ప్రధాన అరబ్ దేశాల నుంచి సరఫరా అయిన అత్తర్లు ప్రస్తుతం అధికంగా అమ్ముడువుతున్నాయి. జిల్లాలోని ప్రధాన మార్కెట్లలో రూ. 35 నుంచి రూ.750కు ఒక గ్రాము చొప్పున విక్రయించడానికి అత్తర్లు అందుబాటులో ఉన్నాయి. ఇక మూడు గ్రామాల్లో లభ్యమయ్యే అత్తరు ధర రూ.100 నుంచి రూ.2500తో లభ్యమవు తున్నాయి.

పిల్లలపై ఓ కన్నేయండి!

● సరదాల మాటున ప్రమాదాల కాటు ● చెరువులు, కాలువల వైపు వెళ్లకుండా చూడాలి
● ఒంటిపూట బడుల నేపథ్యంలో తల్లిదండ్రులూ జాగ్రత్త





ఎండలో పాఠశాల నుంచి ఇంటికి వెళ్తున్న విద్యార్థులు, ఆడుకుంటున్న విద్యార్థులు

భైంసా, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో ఒంటిపూట తరగతులు ఆరంభమయ్యాయి. మధ్యాహ్నం 12.30 గంటలకు బడి విడిచి పెట్టగానే ఇంటికి చేరిన పిల్లలు పుస్తకాలను విసిరేసి ఆటలకు పరుగు తీస్తున్నారు. ఇలాంటి వారిపై ఓ కన్నేయాలి. సరదాల మాటున పొంచి ఉన్న ప్రమాదాలను వారికి అర్థమయ్యేలా వివరించాలి. వాటి నుంచి రక్షించాలి. పిల్లల సంరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వారి మాటల్లోనే.

వీటి జోలికి వెళ్లనీయొద్దు

● గ్రామీణ పట్టణ ప్రాంతాల్లోని చెరువులు, బావుల్లో పిల్లలు ఈతకు వెళ్లకుండా చూడాలి.

● ద్విచక్రవాహనాలు, సైకిళ్లపై మోజుతో ఇంట్లో చెప్పాపెట్టకుండా రోడ్డెక్కితే ప్రమాదాల బారిన పడే అవకాశం ఉంది.

● బడి విడిచిపెట్టగానే కొందరు పిల్లలు సమయం దొరికిందని ఎండలో ఆటలాడుతారు. దీంతో వడదెబ్బకు గురయ్యే ప్రమాదం ఉంది.

● ఒంటిపూట బడులతో స్వేచ్ఛ దొరికిందని నిత్యం ఆరుబయట తిరిగే పిల్లలు పరీక్షల సమయంలో అనారోగ్యానికి గురయ్యే అవకాశాలున్నాయి.

● ఇంట్లో ఖాళీ సమయంలో తరచూ కంప్యూటర్, వీడియో గేమ్‌లు, టీవీలకు అతుక్కుపోవడం వల్ల దృష్టి లోపాలు మానసిక బలహీనులుగా తయరవుతారు.

ఈ జాగ్రత్తలు తీసుకోండి

● ఒంటిపూట బడి వదలగానే మధ్యాహ్నం వేళ్లే పిల్లలను అవసరమైతే తప్ప బయటకు పంపవద్దు. వారికి విశ్రాంతి నివ్వాలి.

● ఇంట్లో అత్యధికంగా కేటాయించే ఈ సమయంలో వీలును బట్టి తల్లిదండ్రులు తమ పిల్లలతో అధిక సమయాన్ని కేటాయించాలి.

● ఖాళీ సమయంలో నిత్యం చదివే పుస్తకాలే కాకుండా విజ్ఞాన దాయకమైన పుస్త కాలు చదివేలా ప్రోత్సహించాలి.

● పిల్లలు ఇంటి నుంచి బయటకు వెళ్లాల్సి వచ్చినప్పుడు సమాచారం ఇచ్చి వెళ్లేలా జాగ్రత్తలు చెప్పండి.

● ఇంటిపట్టున ఉండే పిల్లలకు హోంవర్క్ చేయడంలో సాయపడండి.

● పిల్లలు ఇంట్లో మారం చేస్తున్నారని వారిపై కోపాన్ని ప్రదర్శించకుండా తల్లిదండ్రులు వారిని మంచి మాటలతో మార్గంలో పెట్టాలి.

● మధ్యాహ్నం భోజనం అయ్యాక గంట తర్వాత పాలు, కొబ్బరిబొండాలు, పండ్ల రసాల ద్రవ పదార్థాలు ఇవ్వాలి.

● కాచి చల్లార్చిన లేదా శుద్ధ జలాన్ని ఇవ్వాలి.

● వీలైనంత వరకు విశ్రాంతి తీసుకునేలా చర్యలు తీసుకోవాలి.

● పిల్లలు తప్పనిసరి పరిస్థితుల్లో బయటకు వెళ్లాల్సి వస్తే టోపి లేదా గొడుగు ధరించాలని కచ్చితంగా చెప్పాలి.

ఆహారపు అలవాటు ఇలా..

● ఉదయమే బడికి వెళ్లాలంటే త్వరగా తయారుకావాలి. వీరు తీసుకునే ఆహారం కూడా తేలికపాటిదైతే మంచిది.

● అల్పాహారం, మధ్యాహ్న భోజనంలో కూరగాయలను తీసుకోవాలి.

● తేలిగ్గా జీర్ణమయ్యే ఇడ్లీ లాంటివి అల్పాహారంగా తీసుకోవాలి.

● పండ్లు, పండ్ల రసాలను పిల్లలకు తాగించి బడికి పంపాలి. మధ్యలో ఒకసారి ద్రవపదార్థాలు తాగించాలి.

జ్వరం వస్తే..

●జ్వరంవస్తే నీడలో విశ్రమించేలా చూడాలి

● దుస్తులు వదులు చేసి తడి గుడ్డతో శరీరాన్ని తుడిస్తే వేడి తగ్గుతుంది.

● వైద్యుల సూచనల మేరకు మాత్రలు సిరప్‌లు వాడాలి.

● టైఫాయిడ్ లాంటి జ్వరాలు రాకుండా టీకాలు వేయించుకుంటే ప్రయోజనం.

చదువు ప్రణాళిక

● ఒంటిపూట బడి అయిపోయి తర్వాత ఇంటికి వచ్చి రెండు గంటల పాటు విశ్రాంతి తీసుకుంటే అలసట దరిచేరదు.

● సాయంత్రం వేళ పిల్లనలు చదివించాలి.

● రాత్రి వేళ త్వరగా పడుకుంటే ఉదయం నిద్రలేవడంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తవు.

● ఆరుబయట పడుకుంటే మాత్రం దోమ తెర వాడుకోవాలి.

ఆర్జీయూకేటీలో యువ ఉత్సవ్



కార్యక్రమానికి హాజరైన విద్యార్థులు, సిబ్బంది



పాల్గొన్న అధికారులు

బాసర, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): అంతఃప్రజ్ఞ టెక్ ఫెస్టివల్‌లో భాగంగా యువ ఉత్సవ్ కార్యక్రమం ఆదివారం మినిస్ట్రీ ఆఫ్ యూత్ అఫైర్స్ అండ్ స్పోర్ట్స్, ఎన్ఎస్ఎస్ విభాగం సంయుక్తంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వీసీ ప్రొఫెసర్ గోవర్ధన్, ఓఎస్డీ ప్రొఫెసర్ మురళిదర్శన్, ఏవో రణదీర్ సాగి, నెహ్రూ యువ కేంద్ర ఆదిలాబాద్ జిల్లా డిస్ట్రిక్ట్ యూత్ ఆఫీసర్ సుశీల్ భడ్‌లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వీసీ ప్రొఫెసర్ గోవర్ధన్ మాట్లాడుతూ జాతీయ సమైక్యత ను ప్రోత్సహించడం, భారతదేశ వైవిధ్యమైన సాంస్కృతిక వారసత్వం పట్ల ప్రశంసలను పెంపొందించడం లక్ష్యంగా పెట్టుకుందని తెలిపారు. ఈ కార్యక్రమం వివిధ రంగాలలో భారతదేశ పురోగతిని ప్రదర్శిస్తూనే యువ ఆవిష్కర్తలు కళాకారులు నాయకులను ప్రోత్సహించడానికి ప్రయత్నిస్తుందని తెలిపారు. నెహ్రూ యువ కేంద్ర ఆదిలాబాద్ జిల్లా డిస్ట్రిక్ట్ యూత్ ఆఫీసర్ సుశీల్ భడ్ మాట్లాడుతూ విశాలమైన యువ ఉత్సవ చొరవలో భాగంగా సామాజిక ఐక్యత, సమాజ సేవను ప్రోత్సహిస్తుంది. ఈ చొరవత భారతదేశం 2047 కోసం ప్రభుత్వ దార్శనికతకు అనుగుణంగా ఉంటుందని వెల్లడించారు. ఇందులో భారతదేశాన్ని అభివృద్ధి చేయడం, వలసవాద మనస్తత్వాలను తొలగించడం, వారసత్వాన్ని గర్వించడం ఐక్యతను ప్రోత్సహించడం, పౌరులలో విధి భావాన్ని పెంపొందించడం వంటి వి ఉన్నాయి. భారతదేశ పురోగతిని ప్రదర్శించడం, వివిధ రంగాల్లో భారతదేశం సాధించిన గణనీయమైన పురోగతిని హైలైట్ చేయడం జరిగింది. చివరగా యువ కళాకారులు, యువ రచయితలు ఛాయాచిత్ర రచన, ప్రశంసల పోటీ, సాంస్కృతిక పోటీ, సైన్స్ మేళా పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు నగదు బహుమతులను అందించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ రాకేష్ రెడ్డి, ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ విజయ్ కుమార్, డాక్టర్ రమాదేవి, డాక్టర్ శ్రావణ్ కుమార్, డాక్టర్ రాములు, జూరీ మెంబర్లుగా డాక్టర్ లకుమాదేవి, డాక్టర్ దేవరాజు, డాక్టర్ మహేష్, డాక్టర్ రాజేందర్ పాల్గొన్నారు.

మొక్కల ఉత్పత్తిలో వెనుకంజ

● నాడు లక్షల్లో.. నేడు వేలల్లో ● టార్గెట్ లేక తగ్గిన ఉత్పత్తి ● వన మహోత్సవం ప్రణాళిక లేక ఆదరణ కరువు



నర్సరీలో నత్తనడకన సాగుతున్న మొక్కల ఉత్పత్తి పెంపకం

తలమడుగు, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణ కాలుష్య నివారణ కోసం గత ప్రభుత్వ హయాంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద నర్సరీ లను ఏర్పాటు చేసి ప్రతీ నర్సరీలో 50 వేల నుంచి లక్ష వరకు మొక్కలను పెంపకం చేయాలని ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేసే వారు కానీ కొత్త కొత్త ప్రభుత్వం ఏర్పడ్డాక హరిత హారం పథకంపై నీలి నీడలు ఏర్పడ్డాయి. పథకాన్ని పేరు మార్చి వన మహోత్సవంగా నామకరణం చేసినప్పటికీ హరితహారం మొక్కలపై అధికారుల ఆదరణ కరువైంది. గతంలో మండలంలో దాదాపు 6 నుంచి 8 లక్షల వరకు నర్సరీలో మొక్కలను ఉత్పత్తి చేసేవారు కానీ ప్రస్తుతం మండలంలో 27 నర్సరీలు ఉన్నప్పటికీ కేవలం రెండు లక్షల నలభై వేల మొక్కలే ఉత్పత్తి లక్ష్యంగా నర్సరీను చేపడుతున్నారు. కానీ ఏ నర్సరీలో కానీ ఇప్పటి వరకు మొలకలు సక్రమంగా మొలకెత్తలేదు. కేవలం ప్లాస్టిక్ కవర్‌లో మట్టి నింపి విత్తనాలను నాటారు. కొన్ని నర్సరీలో నాటు కట్టే మొక్కలను తీసుకొచ్చి పెట్టినప్పటికి సక్రమంగా నీరు అందకపోవడం తో మొక్క దశలోనే ఎండిపోతున్నాయి. అంతేకాకుండా నర్సరీలో పనిచేసే కూలీలకు గత మూడు నెలల నుంచి వేతనాలు రాకపోవడంతో పనిచేసే కూలీలు సైతం శ్రద్ధ వహించడం లేదని విమర్శలు వ్యక్త మవు తున్నాయి. ప్రస్తుతం మండలంలో 27 జీపీలో ఏర్పాటు చేసిన నర్సరీలో మూడు వేలు, ఐదు వేల వరకు మొక్కలను ఉత్పత్తి చేసేందుకు ఏర్పాటు చేశారు. కొన్ని నర్సరీలో షెడ్డు సక్రమంగా లేక పోవడంతో ఎండకు ఎండుతూ వాడిపోతున్నాయి. దీనికి తోడు మండల స్థాయి అధికారులు పర్యవేక్షణ చేపట్టక పోవడంతో నర్సరీల పర్య వేక్షణ అస్తవ్యస్తంగా మారిపోయిందని విమర్శలు వ్యక్తమ వుతున్నాయి. కొన్ని నర్సరీలో గత ఏడాది మిగిలి పోయిన మొక్కలనే చూపిస్తు న్నారు. ప్రతీ గ్రామ పంచాయతీకి టార్గెట్ మొక్కల ఉత్పత్తిని అందించి వర్షాకాలం ప్రారంభంలో రోడ్లకు ఇరువైపులా ప్రతీ ఇంటికి ఐదు మొక్కలు అందిస్తే హరిత గ్రామపంచాయతీగా హరిత మండలంగా అభివృద్ధి చెందే అవకాశం ఉందని మండల వాసులు కోరుతున్నారు.



కార్యక్రమానికి హాజరైన భక్తులు



పాల్గొన్న పీఠాధిపతి మాధవానంద సరస్వతి

వైభవోపేతంగా మహారుద్ర అష్టోత్తర పూజ

● పీఠాధిపతి మాధవానంద సరస్వతి హాజరు

బాసర, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): బాసరలో రెండు రోజులుగా కొన సాగుతున్న మహారుద్ర సహిత అష్టోత్తర సువాసిని పూజ కార్యక్రమం ఆదివారం వైభవోపేతంగా ముగిసింది. రెండు రోజుల పాటు స్థానిక వేద పండితులు మురళి ఆధ్వర్యంలో మహారుద్ర సహిత అష్టోత్తర పారాయణం, బ్రహ్మశ్రీ పురాణం మహి శ్వర శర్మతో లలితా వైభవ ప్రవచనాలు వంటివి కొనసాగాయి. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన పండితులు వారి మంత్రోశ్చరణలతో కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. కూచిపూడి వంటి సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. చివరి రోజు పీఠాధిపతి మాధవానంద సరస్వతి హాజరై పాల్గొన్నారు. పూజల అనంతరం శోభాయాత్రగా వెళ్లి సరస్వతీ అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అన్నదానం ఏర్పాటు చేశారు.

సమస్యల కేంద్రంగా సారంగాపూర్ బస్‌స్టేషన్

● మరుగు దొడ్లు లేక ప్రయాణికుల ఇబ్బందులు
● పట్టించుకోని అధికారులు, పాలకులు



నిరుపయోగంగా మారిన ప్రయాణ ప్రాంగణం

సారంగాపూర్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి) : ప్రతీ ఇంటికి మరుగుదొడ్డి తప్పనిసరి అని చెప్పే పాలకులు, అధికారులు ప్రయాణికులకు మాత్రం బస్టాండ్‌లో మరుగుదొడ్డి వసతి కల్పించడం లేదు. మండల కేంద్రంలో గల బస్టాండ్‌లో మరుగుదొడ్లు ఉన్న అవి ఎందుకు పనికి రాకుండా నిరుపయోగంగా మారాయి. దీంతో ప్రయాణికులు ఆరుబయటే అవసరాలు తీర్చుకుంటున్న పరిస్థితి దాపురించింది. ఏళ్లుగా ప్రయాణికులు ఈ అవస్థలు పడుతున్న సంబంధిత అధికారులు, పాలకులు మాత్రం పట్టించుకోవడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సారంగాపూర్ బస్టాండ్ మీదుగా నిత్యం వందలాది మంది ఇతర ప్రాంతాలకు రాకపోకలు కొనసాగించే ప్రయాణికులకు కనీస వసతులు కరువయ్యాయి. బస్టాండ్ ఆవరణలో మరుగుదొడ్లు, తాగునీటి కుళాయిలు ఉన్న ప్పటికీ నిర్వహణ లోపం కారణంగా అవి నిరుపయోగంగా మారాయి. మరు గుదొడ్డి కుళాయిల చుట్టూ పిచ్చి మొక్కలు పెరిగిపోయి దుర్గంధం భరితంగా దర్శనమిస్తున్నాయి. ప్రయాణికుల వసతులపై దృష్టి సారించాల్సిన అధికారులు మాత్రం కనీసం పట్టించుకోవడం లేదంటున్నారు. మహిళలు, వృద్ధులు, చిన్నారులు కనీస అవసరాలు తీర్చుకు నేందుకు పాట్లుపడుతున్నారు. పారిశుద్ధ్యం లోపించి ప్రయాణికులు నిల్చోలేని పరిస్థితి నెలకొంది. దశాబ్ద కాలంగా ఈ సమస్యలు ప్రయాణికులను వేధిస్తున్న అటు పాలకులు గాని అధికారులు గాని కనీసం కన్నెత్తి చూసిన పాపాన పోవడం లేదని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు ఈ విషయంపై దృష్టి సాధించి వెంటనే బస్టాండ్‌లో ఉన్నటువంటి మరుగుదొడ్లను శుభ్రపరిచి బస్టాండ్‌ను శుభ్రపరిచి వాడకంలోకి తేవాలని కోరుతున్నారు.

గురుకుల పిల్లలు.. ఆటల్లో మెరుపులు



గోల్డ్ మెడల్‌తో జాదవ్ కుషావర్తి, పీడీ సౌమ్య



పతకాలు సాధించిన కళాశాల విద్యార్థులతో ఐటీడీఏ పీవో కుష్బూ గుప్తా

ఇంద్రవెల్లి, మార్చి 23(ఆంధ్రజ్యోతి): గిరిజన సంక్షేమ గురుకుల విద్యార్థులు అటు ఆటలు...ఇటు చదువులోనూ ప్రతిభ చూపుతూ తమకం టూ ప్రత్యేక చాటుతున్నారు. గురుకుల సొసైటీతో పాటు అండర్-16, 17, 18 జోనల్, రాష్ట్ర స్థాయి వేదికల్లో ప్రదర్శనలిస్తున్నారు. భవి ష్యత్తులో తాము కలలు కన్న ఉద్యోగాల సాధనకు వీటిని మెట్లుగా భావించి ఒక్కొక్క మెట్టు ఎక్కుతూ రాష్ట్ర స్థాయి క్రీడలకు అర్హత సాధిస్తున్నారు. ఆదివారం హైదరాబాద్‌లోని గడియం ఇంటర్నేషనల్ స్కూల్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ ఛాంపియన్ షిప్ పోటీల్లో అండర్-20 బాలికల విభాగంలో ఇంద్రవెల్లిలోని గిరిజన బాలికల గురుకుల సం క్షేమ జూనియర్ కళాశాలకి చెందిన ఇంటర్ మొదటి సంవ త్సరం చదువుతున్న జాదవ్ కుషావర్తి జావెలిన్ త్రో విభాగం లో ప్రతిభ కనబర్చి గోల్డ్ మెడల్ సాధించి పెట్టారు. ఇటీవల హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీ ప్రాంగణంలో జరిగినటువంటి 11వ రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ చాంపీయన్ షిప్ పోటీల్లో ఇదే కళాశాలకు చెందిన ఇంటర్ ద్వితీయ సంవత్సరం ఎంపీసీ చదువు తున్న పెందూర్ సక్కు అండర్-16 విభాగంలో హైజంప్‌లో గోల్డ్ మెడల్, డిస్కస్ త్రోలో బ్రాంజ్ మెడల్ సాధించగా, నూనవత్ రాణి డిస్కస్ త్రోలో సిల్వర్ మెడల్ సాధించి పెట్టారు. దీంతో వీరిని ఉట్నూర్‌లో ఐటీడీఏ పీవో కుష్బు గుప్తా, గిరిజన గురుకులాల రీజనల్ కోఆర్డీనేటర్ ఆగస్టీన్, కళాశాల ప్రిన్సిపాల్ సంగీతలు మెడల్స్ మెరిట్ సర్టిఫికెట్‌లను అందించి ప్రశంసించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ సంగీత, జిల్లా అథ్లెటిక్స్ అసోషియేషన్ జనరల్ సెక్రటరీ రాకేష్‌లు మాట్లాడుతూ రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ చాంపియన్ షిప్ పోటీల్లో ఇంద్రవెల్లిలోని ముత్నూర్ గిరిజన బాలికల గురుకుల కళాశాలకు చెందిన విద్యార్థినిలు పలు విభాగాల్లో పథకాలు సాధించడం అభినందనీయమని అన్నారు. ఇందులో పీడీ సౌమ్య, పీఈటి శానుబాయి, వైస్ ప్రిన్సిపాల్‌లు విజయలక్ష్మి, భార్గవి, కళా శాల ఉపాధ్యాయబృందం, విద్యార్థినులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి
andhrajyothy.com
ఆదివారం ఉష్ణోగ్రత గరిష్ఠం 38.0। కనిష్ఠం 20.0

ఆదిలాబాద్
జిల్లా వార్తలు
5
సోమవారం 24 మార్చి 2025


ఉట్నూర్‌లో భగత్‌సింగ్ వర్ధంతి నిర్వహిస్తున్న దృశ్యం

భగత్‌సింగ్‌కి భారతరత్న ఇవ్వాలి

● టీఏవీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పూసం సచిన్

ఉట్నూర్, మార్చి23 (ఆంధ్రజ్యోతి): బ్రిటీష్ సామ్రాజ్య వాదానికి వ్యతిరేకంగా 23ఏళ్లకే ఉరికొయ్యను ముద్దాడి దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలు అర్పించిన భగత్‌సింగ్‌కు కేంద్ర ప్రభుత్వం భారతరత్న అవార్డు ప్రకటించాలని తెలంగాణ ఆదివాసీ విద్యార్థి సంఘం (టీఏవీఎస్) రాష్ట్ర అధ్యక్షుడు పూసం సచిన్ డిమాండ్ చేశారు. ఆదివారం భగత్‌సింగ్, రాజ్‌గురు సుఖ్‌దేవ్‌ల 94వ వర్ధంతి కార్యక్రమం మండల కేంద్రంలోని డిగ్రీ కళాశాల గిరిజన హాస్టల్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమరవీరుడు షహీద్ భగత్‌సింగ్ 1931 మార్చి 23న నాటి బ్రిటీష్ పాలకులు భగత్‌సింగ్, రాజురు, సుఖ్‌దేవ్‌లను లాహోర్ జైలులో ఉరితీశారన్నారు. పరాయి పాలకలను దేశం నుంచి తరిమి కొట్టాలనే ఆకాంక్షతోనే ఆగిపోకుండా స్వతంత్ర భారతదేశంలో ఎలాంటి విధానాలు అవలంబిస్తే ప్రజలకు మేలు కలుగుతుందనే విషయంలోనూ సమగ్ర దృక్పథం కలిగిన కొద్దిమంది స్వాతంత్ర ఉద్యమకారుల్లో భగత్‌సింగ్ ఒకరు అని కొనియాడారు. నేటి యువత భగత్‌సింగ్ అడుగుజాడల్లో నడిచి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలకు వ్యతిరేకంగా పోరాటాలకు సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఇందులో రాష్ట్ర కార్యదర్శి ఆత్రం తనుష్, జిల్లా అధ్యక్షుడు ఉయిక విష్ణు, ఉపాధ్యక్షుడు కోవా సునీల్, విద్యార్థులు మురళి, నవీన్, దేవదాస్, తదితరులు పాల్గొన్నారు.

● నేటి యువతకు భగత్‌సింగ్ ఆదర్శం

బోథ్: దేశ స్వాతంత్ర్యం కోసం ఉరికంబాన్ని ఎక్కిన విప్లవ వీరుడు భగత్‌సింగ్ 94వ వర్ధంతిని టీజీవీపీ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం జరుపుకున్నారు. ఈ సందర్భంగా నియోజకవర్గ కోకన్వీనర్ సతీస్ మాట్లాడుదూ దేశం కోసం ప్రాణాలను సైతం లెక్కచేయకుండా పోరాడిన గొప్ప యోధుడు భగత్‌సింగ్ అని పేర్కొన్నారు. ఆయన జీవితం నేటి తరానికి ఆదర్శం అన్నారు. విద్యార్థులు యువకులు, దేశ రక్షణ కోసం ముందుకు రావాలని కోరారు. భగత్‌సింగ్ ఆశయాల కోసం పాటుపడాల్సిన అవసరం ఉందన్నారు. ఇందులో తరుణ్ సంతోష్, ఆదికేశవ, రామానాయుడు, కళ్యాణ్, కిషోర్, శివ, సురేష్, తదితరులు పాల్గొన్నారు.


బోథ్‌లో భగత్‌సింగ్ విగ్రహానికి పూలమాల వేస్తున్న టీజీవీపీ నాయకులు

26న ఉట్నూర్ ఐటీడీఏ నర్సరీ పండ్ల తోటల వేలం : పీవో

ఉట్నూర్, మార్చి 23(ఆంధ్రజ్యోతి): ఐటీడీఏ పరిధిలోని ఉద్యాన నర్సరీ మామిడి పండ్ల తోటల వేలం మార్చి 26న ఉన్నట్లు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఖుష్బుగుప్తా ఒక ప్రకటనలో తెలిపారు. ఉట్నూర్ తోటలో బంగినపల్లి, దోశరితో తాపురి, రసాలు, హిమాయత్ మరియు లాంగ్ర వంటి మామిడి హైబ్రిడ్ రకాలు ఉన్నాయని, 2025 పంట కాలానికి ఈ పండ్ల తోటల వేలం జరుగుతున్నట్లు తెలిపారు. ఆసక్తి కలిగిన వ్యాపారస్థులు రూ.10వేల దారవత్తు సొమ్ముతో 26వ తేదీన ఉదయం 10గంటలకు పాల్గొనాలని ప్రాజెక్టు అధికారి సూచించారు. వేలంలో తోటను దక్కించుకున్న వారు సగం సొమ్మును వెంటనే చెల్లించాలని, మిగత సొమ్మును వారం రోజుల్లో చెల్లించాలని సూచించారు. మొత్తం సొమ్ము చెల్లించిన తర్వాతనే కాయలు కోయడానికి అనుమతి ఉంటుందని స్పష్టం చేశారు. మరిన్ని వివరాలకు ఐటీడీఏ ప్రాజెక్టు ఉద్యాన అధికారి లేదా సంబంధిత నర్సరీ సాంకేతిక అధికారులను ఫోన్ నెంబర్లలో 8897478825, 9441020755 సంప్రదించాలని ప్రకటనలో పేర్కొన్నారు.

మహిళలు ఆర్థికంగా రాణించాలి

ఆదిలాబాద్ రూరల్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): మహిళలకు కుటుంబానికి ఆర్థికంగా అండగా ఉండాలనే లక్ష్యంతో అందించే శిక్షణాలను సద్వినియోగం చేసుకుంటు రాణించాలని సాయివైకుంఠ ట్రస్ట్ చైర్మన్, ప్రముఖ హోమియోపతి వైద్యులు డాక్టర్ రవి కిరణ్ యాదవ్ అన్నారు. ఆదివారం ట్రస్ట్ భవనంలో మూడు నెలల శిక్షణ పూర్తి చేసుకున్న అభ్యర్థులకు సర్టిఫికేట్లను అందించారు. ఈ సందర్భంగా అభ్యర్థులు చేసిన నృత్యాలు ఆకట్టుకున్నారు. అనంతరం మహిళలు, యువతలకు ఆయా విభాగాల్లో శిక్షణ ఇచ్చిన శిక్షకులను శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా సాయి వైకుంఠ ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ రవికిరణ్ యాదవ్ మాట్లాడుతూ.. ప్రస్తుతం ధరలు పెరుగుతున్న నేపథ్యంలో మహిళలు కుటుంబానికి చేయూత నివ్వాలనే ఉద్దేశంతో ట్రస్ట్ తరపున కుట్టుమిషన్, అల్లికలతోపాటు ఎంబ్రాయిడరీ, ఉన్ని వస్తువుల తయారీపై శిక్షణాలు అందిస్తున్నామని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు. శిక్షణాలకు మహిళలు నిత్యం వచ్చి వినియోగించుకోవడం సంతోషంగా ఉందన్నారు. సర్టిఫికెట్లను తీసుకున్నాం కాదా ఇక అయిపోయిందని అనుకొకుండా స్వయం ఉపాధి వైపు అడుగులు వేయాలని సూచించారు. సంపాదిస్తు పిల్లలతో పాటు తమ భవిష్యత్తును మెరుగ్గా తీర్చిదిద్దుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ప్రొఫెసర్ నల్ల విజయ్‌బాబు, శ్రీరు, తదితరులు పాల్గొన్నారు.



సర్టిఫికెట్‌ను అందజేస్తున్న డాక్టర్ రవికిరణ్ యాదవ్



అందనంత దూరం.. పశు వైద్యం!

- ▸▸ జిల్లాలో పాడి రైతులకు అందని పశువైద్య సేవలు
- ▸▸ నెరవేరని కొత్త ఆసుపత్రుల ఏర్పాటు
- ▸▸ ఉన్న వాటిల్లో కరువైన కనీస సౌకర్యాలు
- ▸▸ మరికొన్ని ఆసుపత్రులకు ఇన్‌చార్జీలే దిక్కు
- ▸▸ జిల్లావ్యాప్తంగా మొత్తం 37 పశువుల ఆసుపత్రులు

ఉట్నూర్, మార్చి 23(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల రైతుల పశువులకు పశువైద్యం అందనంత దూరంలోనే ఉండిపోయిందని రైతులు పేర్కొంటున్నారు. పాడి సంపదను అభివృద్ధి చేసి పాల వ్యాపారం ద్వారా ఉపాధి పొందాలని భావిస్తున్నా.. పాడి రైతులకున్న పశువులకు వైద్య సేవలు అందడం లేదు. పశు సంవర్థక శాఖ ఆధ్వర్యంలో ఉన్న ఆసుపత్రులకు కనీస సౌకర్యాలు కరువయ్యాయి. శిథిలావస్థలో ఉన్న భవనాల స్థానంలో కొత్త భవనాలు నిర్మించాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపిస్తున్నా.. అమలు కావడం లేదు. 30 ఏళ్ల క్రితం ప్రారంభించిన పశువుల ఆసుపత్రులతోటే కాలం నెట్టుకొస్తున్న ప్రభుత్వాలు.. కొత్త ఆసుపత్రులను మంజూరు చేయడంలో నిర్లక్ష్యం చేస్తున్నాయి.


ఉట్నూర్‌లో శిథిలదశకు చేరిన పశువుల ఆసుపత్రి


శ్యామ్‌పూర్‌లో కూలిపోయే దశలో ఉన్న పశువుల ఆసుపత్రి

జిల్లాలో 37 ఆసుపత్రులు

జిల్లావ్యాప్తంగా మొత్తం 37 పశువుల ఆసుపత్రులు ఉన్నాయి. అందులో ఆదిలాబాద్ రూరల్ మండలంలోని యాపల్‌గూడలో ప్రాథమిక పశువైద్య కేంద్రం, వాగాపూర్‌లో గ్రామీణ పశువైద్య కేంద్రం, అలాగే తాంసి మండల కేంద్రంలో ప్రైమరీ వెటర్నరీ సెంటర్, అర్లి(టి)లో గ్రామీణ పశువైద్య కేంద్రం, పొన్నారిలో ప్రాథమిక పశువైద్య కేంద్రం ఉంది. అలాగే తలమడుగు మండల కేంద్రంలో ప్రాథమిక పశువైద్య కేంద్రం, సుంకిడిలో గ్రామీణ పశువైద్య కేంద్రం, దేవపూర్‌లో గ్రామీణ పశువైద్య కేంద్రం ఉంది. అలాగే జైనథ్ మండలకేంద్రంలో ప్రాథమిక పశువైద్య కేంద్రం, బోరజ్‌లో గ్రామీణ పశువైద్య కేంద్రం, గిమ్మలో ప్రాథమిక పశు వైద్య కేంద్రం, పెండల్‌వాడలో గ్రామీణ పశు వైద్య కేంద్రం, అలాగే బేల మండల కేంద్రంలో ప్రాథమిక పశువైద్య కేంద్రం, సాంగిడిలో ప్రాథమిక పశువైద్య కేంద్రం ఉంది. అలాగే బోథ్ మండల కేంద్రంలో ఏరియా పశు వైద్య పశువుల ఆసుపత్రి, సోనాలలో ప్రాథమిక పశువైద్య కేంద్రం, కౌట(బి)లో గ్రామీణ పశువైద్య కేంద్రం ఉంది. అలాగే బజార్‌హత్నూర్ మండల కేంద్రంలో ప్రాథమిక పశువైద్య కేంద్రం, ఇచ్చోడలో ప్రాథమిక పశువైద్య కేంద్రం, సిరికొండలో ప్రాథమిక పశువైద్య కేంద్రం గుడిహత్నూర్‌లో ప్రాథమిక పశువైద్య కేంద్రం, తోషంలో గ్రామీణ పశువైద్య కేంద్రం, శాంతాపూర్‌లో ప్రాథమిక పశువైద్య కేంద్రం ఉంది. అలాగే నేరడిగొండలో ప్రాథమిక పశువైద్య కేంద్రం, వాంకిడిలో ప్రాథమిక పశువైద్య కేంద్రం, తర్లంలో గ్రామీణ పశువైద్య కేంద్రం, ఉట్నూర్ డివిజన్ కేంద్రంలో ఏరియా వెటర్నరి హాస్పిటల్, షాంపూర్‌లో గ్రామీణ పశువైద్య కేంద్రం, ఉదయ్‌నాయక్ తండాలో ప్రాథమిక పశువైద్య కేంద్రం ఉంది. అలాగే ఇంద్రవెల్లిలో ప్రాథమిక పశువైద్య కేంద్రం, ముత్నూరులో గ్రామీణ పశువైద్య కేంద్రం, నార్నూర్, తాడిహత్నూర్‌లలో ప్రాథమిక పశువైద్య కేంద్రాలు, గాదిగూడలో గ్రామీణ పశువైద్య కేంద్రం, జిల్లా పశువైద్య కేంద్రంతో పాటు ప్రాథమిక పశు వైద్య కేంద్రాలు ఉన్నాయి.

కొన్నిచోట్ల ఇన్‌చార్జీలే..

జిల్లావ్యాప్తంగా 37 పశువుల ఆసుపత్రులు ఉండగా.. ఐదు కేంద్రాలకు ఇన్‌చార్జీ డాక్టర్లు పని చేస్తున్నారు. ఇన్‌చార్జీ డాక్టర్ల వల్ల గ్రామీణ పశువైద్య కేంద్రాల్లో సరైన పశువైద్య సేవలు అందడం లేదని రైతులు పేర్కొంటున్నారు. ఉట్నూర్ మండలంలోని ఉదయనాయక్ తండాలో ఇంద్రవెల్లి మండలం ముత్నూరు డాక్టర్ విజయ్‌కుమార్ ఇన్‌చార్జీగా ఉన్నారు. ఉట్నూర్ మండలం షాంపూర్ గ్రామీణ పశు వైద్యశాలకు సైతం విజయ్‌కుమార్ ఇన్‌చార్జీగా ఉండడంతో ఆయన మూడు ఆసుపత్రులను చూడాల్సి వస్తుంది. అదేవిధంగా గాదిగూడ పశువైద్య కేంద్రానికి సైతం డాక్టర్ విజయ్‌కుమార్ ఇన్‌చార్జీగా వ్యవహరిస్తున్నారు. నార్నూర్, తాడిహత్నూర్ పశువుల ఆసుపత్రులకు గుడిహత్నూర్ మండలంలోని శాంతాపూర్ డాక్టర్ వంశీ ఇన్‌చార్జీగా వ్యవహ రిస్తున్నారు. సోనాల

(తరువాయి 6వ పేజీలో...)

రైతులకు అందుబాటులో పశువైద్య కేంద్రాలు ఏర్పాటు చేయాలి

: పెందూరు ప్రభాకర్, రాష్ట్ర అధ్యక్షుడు, రాజ్‌గోండు సేవా సమితి



పశు సంతతిని రైతులు కాపాడుకునే విధంగా ప్రభుత్వం రైతులకు అందుబాటులో పశువైద్య కేంద్రాలను ఏర్పాటు చేయాలి. ఉమ్మడి రాష్ట్రంలో ఏర్పాటు చేసిన పశువైద్య కేంద్రాలని కొనసాగిస్తున్నారు. తెలంగాణ ప్రభుత్వం కొత్త పశువైద్య కేంద్రాలను ఏర్పాటు చేసి రైతులకు ప్రయోజనం కలిగించే విధంగా కృషి చేయాలి. ఐటీడీఏ కార్యాలయంలో పశు సంవర్థక శాఖను పునరుద్ధరించాలి.

కొత్త ఆసుపత్రులకు ప్రతిపాదనలు పంపించాం

: బానోత్ కిషన్, జాయింట్ డైరెక్టర్, పశు సంవర్థక శాఖ, ఆదిలాబాద్



జిల్లాలోని కొత్త పశువుల ఆసుపత్రుల ఏర్పాటు కోసం ప్రతిపాదనలు పంపించాం. అదే విధంగా ఆసుపత్రుల భవనాల నిర్మాణాల కోసం ప్రతిపాదనలు పెండింగ్‌లో ఉన్నాయి. ఐదు చోట్ల పశువుల ఆసుపత్రులకు ఇన్‌చార్జీలు ఉన్నారు. ఆసుపత్రుల్లో మందుల కొరత లేదు. సకాలంలో కావాల్సిన మందులు అందిస్తున్నాం.

పేదల సంక్షేమమే ప్రజా ప్రభుత్వ ధ్యేయం

● ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ ● రిమ్మ గ్రామం పరిధిలో 153 ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి భూమిపూజ ● రూ.20 లక్షల ఎస్డీఎఫ్ నిధులతో నిర్మించిన నూతన గ్రామ పంచాయతీ భవనాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే


నూతన పంచాయతీ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్


ఇందిరమ్మ ఇళ్లకు భూమిపూజ చేస్తూ..

సిరికొండ, మార్చి 23(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్లను అర్హులైన ప్రతీ పేదకుటుంబానికి అందజేస్తామని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. ఆదివారం మండలంలోని రిమ్మ గ్రామంలో రూ.20 లక్షల ఎస్డీఎఫ్ నిధులతో నిర్మించిన నూతన పంచాయతీ భవనాన్ని ప్రారంభించారు. అనంతరం రిమ్మ గ్రామపంచాయతీ పరిధిలోని రాజంపేట్, తిమ్మాపూర్ గ్రామాల్లో 153 ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులకు భూమిపూజ చేసి, పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పేదల సంక్షేమానికి పెద్దపీట వేస్తూనే గ్రామాలను అన్ని విధాలుగా అభివృద్ధి పరిచేందుకు ప్రత్యేకకృషి చేస్తుందన్నారు. గ్రామాలలో నెలకొన్న సమస్యలను దశల వారీగా పరిష్కరించేందుకు పటిష్ఠమైన చర్యలు తీసుకుంటున్నామని ఆయన పేర్కొన్నారు. గ్రామాలు అభివృద్ధి చెందినప్పుడే రాష్ట్రం, దేశం అభివృద్ధి చెందుతుందన్నారు. పట్టణాలకు, నగరాలకు గ్రామాలే పట్టుకొమ్మలని అన్నారు. ఇళ్లు లేని నిరుపేద కుటుంబాలకు మొదటి విడతలో ఇందిరమ్మ ఇండ్లను ఇస్తామన్నారు. పేదకుటుంబాలను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని ఆయన తెలిపారు. ప్రజా ప్రభుత్వం గృహజ్యోతి పథకం కింద 200 యూనిట్ల ఉచిత విద్యుత్‌తోపాటు రూ.500 లకే గ్యాస్ సిలిండర్ అందిస్తుందని పేర్కొన్నారు. పేదోడి సొంతింటి కళలను సాకారం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం పూనుకుందని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో రవీందర్, ఎంపీవో సంతోష్, ఏఈ నజీర్, ఎస్సై శివరాం, ఇంద్రవెల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ ముఖడె ఉత్తం, కాంగ్రెస్ పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ సర్పంచ్ పెందూర్ అనిల్ కుమార్, మాజీ జడ్పీటీసీ కుమ్ర రఘురాం, రాథోడ్ ప్రవీణ్, మండల ప్రెసిడెంట్ ఇమామ్, ఆయా గ్రామాల పటేల్‌లు, సార్మేడీలు, తదితరులు పాల్గొన్నారు.


ఉట్నూర్‌లో ఎమ్మెల్యేని సన్మానిస్తున్న ఆదివాసీ సంఘాల ప్రతినిధులు

● గోండ్వాన రాయి దర్బార్ విజయవంతం చేయాలి

ఉట్నూర్: కోయ పున్నెం గోండ్వాన రాయిదర్బార్‌ను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే బొజ్జుపటేల్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ కరపత్రాలను విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గోండ్వాన సమాజం అందరూ తమ సంస్కృతీ, సంప్రదాయాలు, దేవతలను కాపాడాలని అన్నారు. అలాగే రాజ్‌గోండు సేవా సమితి భవనంకి కోటి రూపాయలు మంజూరు చేసిన ఎమ్మెల్యేకు సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో మంగం విషంరావు రాజ్‌గోండ్ సేవా సమితి ప్రధాన కార్యదర్శి కోరెంగ సీతారాం గుండి భాషా రాష్ట్ర అధ్యక్షుడు, రాజ్‌గోండు సేవా సమితి, జిల్లా ప్రధాన కార్యదర్శి గేడం నీరంజన్, ఉట్నూర్ డివిజన్ అధ్యక్షుడు ఆత్రం ప్రకాష్, ఉట్నూర్ డివిజన్ ప్రధాన కార్యదర్శి మడావి బాలాజి, సిడాం వరప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

● సోమాసే వెంకటరావు మృతి పార్టీకి తీరని లోటు

ఇంద్రవెల్లి: మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు సోమాసే వెంకటరావు మరణం పార్టీకి తీరని లోటని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. ఆదివారం ఇంద్రవెల్లి మండల కేంద్రంలోని వెంకటరావు సోమాసే స్వగ్రామానికి వెళ్లి ఆయన భౌతిక కాయానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్టీలో క్రియాశీలకంగా పనిచేసిన వారిలో వెంకటరావు పాత్ర కీలమైందని అన్నారు. కాంగ్రెస్ పార్టీ కోసం వారు చేసిన త్యాగం మరవలేనిదన్నారు. నిత్యం ప్రజల మధ్య ఉంటూ పార్టీ అధికారంలో ఉన్న, లేకున్నా కాంగ్రెస్ జెండాను చేతపట్టుకుని ప్రజల సమస్యలపై గళమెత్తిన నాయకుడని నేడు కోల్పోవడం బాధాకరమని అన్నారు. నేడు కాంగ్రెస్ పార్టీ ఓ గొప్ప నాయకుడిని కోల్పోయిందని, వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని దేవుణ్ని ప్రార్థిస్తూ మృతి పట్ల ప్రగాఢ సానుభూతి తెలిపారు. వారి వెంట కాంగ్రెస్ పార్టీ నాయకులు, తదితరులు ఉన్నారు.


ఉట్నూర్‌లో సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి చిత్రపటానికి క్షీరాభిషేకం

ఉట్నూర్, మార్చి 23(ఆంధ్రజ్యోతి): రాజీవ్ యువ వికాసం పథకాన్ని నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని యూత్ కాంగ్రెస్ నాయకులు కోరారు. బీసీ కులగణన, ఎస్సీ వర్గీకరణ అసెంబ్లీలో ఆమోదం పట్ల హర్షం వ్యక్తం చేసిన యూత్ కాంగ్రెస్ నాయకులు ఉట్నూర్ యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఆదివారం మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో ముఖ్యమంత్రి చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న నియోజకవర్గ యూత్ ఉపాధ్యక్షుడు అరకిల్ల పరమేశ్వర్‌రావు మాట్లాడుతూ తెలంగాణ ప్రజా ప్రభుత్వం నిరుద్యోగ యువతీ, యువకుల కోసం నిరుద్యోగులు వారి కాళ్ల మీద వారు నిలబడాలన్నా ఉద్దేశంతో రాజీవ్ యువ వికాసం ద్వారా 50 వేల నుంచి ఐదు లక్షల వరకు ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ కార్పొరేషన్ల ద్వారా ఆర్థిక సహాయాన్ని అందించడానికి మార్చి 15 నుంచి ఏప్రిల్ 5 వరకు దరకాస్తులు స్వీకరణ జరుగుతుందన్నారు. ఈ గొప్ప అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఇంత గొప్ప పథకాన్ని ప్రవేశ పెట్టిన సీఎం రేవంత్‌రెడ్డితో పాటు బీసీ శాఖ మంత్రి పొన్న ప్రభాకర్, దామోదర రాజనర్సింహ, ఇన్‌చార్జీ మంత్రి సీతక్క, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్‌లకు కూడా క్షీరాభిషేకం చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తీగుట్ల రాజ్‌కుమార్, అశోక్, మారుతి, పార్టీ సీనియర్ నాయకులు సయ్యద్‌నిసార్, భీమన్న, మహిళ కాంగ్రెస్ నాయకులు మేస్రం భాగ్యలక్ష్మి, నాయకులు రాజేశ్, కొట్నాక్ ఉమేష్, హర్షద్, కలీం, మహేందర్, రాజాగౌడ్, స్వామి, గంగాధర్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉగాది నుంచి సన్న బియ్యం : గోక

తలమడుగు, మార్చి 23(ఆంధ్రజ్యోతి): తెల్ల రేషన్ కార్డు ఉన్న లబ్ధిదారులందరికీ ఉగాది నుంచి సన్న బియ్యం పంపిణీ చేసినందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని కాంగ్రెస్ పార్టీ జిల్లా సీనియర్ నాయకులు మాజీ జడ్పీటీసీ గోక గణేష్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలు ఇచ్చిన హామీలో భాగంగా తెల్ల రేషన్ కార్డు ఉన్న లబ్ధిదారులందరికీ ఒక్కొక్కరికి ఆరు కిలోల చొప్పున సన్న బియ్యం అందించేందుకు సీఎం రేవంత్‌రెడ్డి కృషి చేస్తున్నారన్నారు. అలాగే ఉపాధి పథకం ద్వారా రూ.2 కోట్ల వరకు నిధులు మంజూరయ్యాయన్నారు. ఈ నిధులతో ప్రతి గ్రామంలోని సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టడం జరుగుతుందన్నారు. అనంతరం తలమడుగులో సీసీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఇందులో సహకార సంఘం మండల ఉపాధ్యక్షుడు నల్ల పద్మాకర్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్ రాజేశ్వర్ ధనుంజయ్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మొక్కల ఉత్పత్తిలో వెనుకంజ!

● నాడు లక్షల్లో... నేడు వేళల్లో..
● టార్గెట్ లేక తగ్గిన ఉత్పత్తి
● వన మహోత్సవం ప్రణాళిక లేక ఆదరణ కరువు

వివరాలు 7వ పేజీలో..


నర్సరీలో నత్తనడకన సాగుతున్న మొక్కల పెంపకం

రంజాన్ వేళలు

ఇఫ్తార్ : 6.33 (సోమవారం సాయంత్రం)
సహర్ : 4.04 (మంగళవారం ఉదయం)

ఎవరైతే తన భార్య పట్ల ఉత్తమంగా, సక్రమంగా ప్రవర్తిస్తాడో.. అతడే అత్యుత్తమమైన వ్యక్తి. దైవానుగ్రహానికి సైతం అర్హుడవుతాడు.